RNI No: TELTEL/2022/83073


# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:60 | ఫిబ్రవరి 08, 2026 | వెల: రూ.3-00




2లో




# మంత్రుల పరేషాన్!

## మున్సిపల్ ఎన్నికలు తెచ్చిన తిప్పలు

2లో

- అన్నిచోట్లా అంతర్గత కలహాలతో సతమతం
- వెంటాడుతున్న అసంతృప్తుల భయం
- సొంత నియోజకవర్గంలోనూ అమాత్యులదే బాధ్యత
- కొంచెం తేడా వచ్చినా పదవీ గండం తప్పదా?
- ఫలితాల తర్వాత క్యాబినేట్లో మార్పులు చేర్పులు
- పురు పోరు ఎవరి పదవికి ఎసరు పెట్టేనో..?
- కాంగ్రెస్ పార్టీలో ఇదే హాట్ టాపిక్

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో మోగిన మున్సిపల్ ఎన్నికల నగారా.. మంత్రుల్లో గుబులు రేపుతోంది. ఇది కేవలం స్థానిక సంస్థల పోరు మాత్రమే కాదు.. మంత్రుల పనితీరుకు, వారి భవిష్యత్తుకు అసలు సిసలైన అగ్నిపరీక్షగా మారింది. మున్సిపల్ ఫలితాలనే రిపోర్ట్ కార్డుగా పరిగణిస్తామని, పనితీరు ఆధారంగానే కేబినెట్‌లో కొనసాగింపు ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన సంకేతాలు ఇవ్వడంతో మంత్రుల్లో టెన్షన్ మొదలైంది. సొంత నియోజకవర్గాలే కాకుండా.. అప్పగించిన పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీలను గెలిపించే బాధ్యత భుజాన వేసుకున్న మంత్రులు.. అంతర్గత కుమ్ములాటలు, అసమ్మతి సెగలను చల్లార్చలేక సతమతమవుతున్నారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాల పాఠాలతో.. పదవిని కాపాడుకునేందుకు మంత్రులు వ్యూహాలు రచిస్తున్నారు.



### రేవంత్ ఏ నాటికైనా

# బీజేపీ మనిషే

### కాంగ్రెస్ ముసుగు తొలగించండి

- మైనారిటీలకు, బీసీలకు భారీ బడ్జెట్ ఇస్తామని చెప్పి మోసం చేశారు
- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బుద్ధి చెప్పండి
- సీఎం విసిరే ఎంగిలి మెతుకుల కోసం పోచారం కాంగ్రెస్‌లో చేరారు
- కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

2లో



### బ్యాక్‌లాగ్ పోస్టుల పేరుతో

# బ్యాక్ డోర్ నియామకాలు?!

### నిబంధనలు పక్కన పెట్టి అక్రమ భర్తీ?

- లక్షల రూపాయల వసూళ్లపై నిరుద్యోగుల ఆగ్రహం
- యువతకు ప్రభుత్వ వైఖరి నిరాశే మిగులుస్తోంది
- జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపణలు

2లో

### గోదావరి జలాలతో

# సస్యశ్యామలం

- తాండూరు, పరిగి, వికారాబాద్ ప్రాంతాలను పచ్చగా మారుస్తాం
- మూడేళ్లలో కొడంగల్ ఎత్తిపోతల పూర్తి
- వికారాబాద్‌ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- తాండూరులో డ్రైనేజీ, తాగునీటి పనులు పూర్తి
- సీఎం రేవంత్ రెడ్డి



**వేద న్యూస్, వికారాబాద్**

గోదావరి జలాల ద్వారా తాండూరు, పరిగి, వికారాబాద్ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే వచ్చే మూడేళ్లలో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సుమారు లక్షా యాభై వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. ప్రజా పాలన-ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా నారాయణపూర్ గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణతో పాటు అవసరమైన

మిగతా 2వ పేజీలో..

# ఉరి సీన్ రీల్ తీస్తూ..

- ప్రమాదవశాత్తు మెడకు బిగుసుకున్న తాడు
- మహిళ మృతి
- ఉత్తర ప్రదేశ్లో విషాదం
- తల్లిని కోల్పోయిన నాలుగేళ్ల చిన్నారి



2లో

# ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక ఆధారాలు ఉన్న ప్రయోగశాలలో మంటలు

- ముందే ధ్వంసమైన హార్డ్ డిస్కుల వ్యవహారం
- చార్జిషీట్ దశలో అనుమానాస్పద ఘటన
- కావాలనే చేయించారా? లేక యాదృచ్ఛికమా?
- రాజకీయ వర్గాల్లో చర్చ

2లో

వేద న్యూస్



## బ్యాక్‌లాగ్ పోస్టుల పేరుతో

# బ్యాక్ డోర్ నియామకాలు?!

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

రాష్ట్రంలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ పేరుతో దొడ్డిదారిన నియామకాలు జరుగుతున్నాయని కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. నియామకాల ప్రక్రియలో పారదర్శకత లేకుండా నిబంధనలను పక్కన పెట్టి అక్రమంగా చర్యలు చేపడుతున్నారని ఆమె మండిపడ్డారు. ఈ నెల 9, 10 తేదీల్లో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, విద్య తదితర శాఖల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ భర్తీకి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆమె పేర్కొన్నారు. అయితే ఈ నియామకాలలో అర్హత, పరీక్ష, ప్రతిభ వంటి ప్రమాణాలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఒక్కో ఉద్యోగానికి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారన్న నిరుద్యోగుల ఆవేదనను ఆమె ప్రస్తావించారు. ముఖ్యంగా జిల్లా స్థాయిలో దొడ్డిదారిన నియామకాలు జరుగుతున్నాయన్న సమాచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ విధమైన అక్రమ చర్యల వల్ల లక్షలాది మంది నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి ఆశతో ఎదురుచూస్తున్న యువతకు ప్రభుత్వ వైఖరి నిరాశనే మిగులుస్తోందని అన్నారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన నిరుద్యోగులు, యువతనే ఇప్పుడు ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగాల పేరిట ఆశలు చూపి చివరికి యువత నోట్లో మట్టి కొట్టినట్లవుతోందని వ్యాఖ్యానించారు. తక్షణమే ఈ నియామకాలను నిలిపివేసి, న్యాయబద్ధమైన, పారదర్శకమైన విధానంతోనే ఉద్యోగ భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

## రేవంత్ ఏ నాటికైనా

# బీజేపీ మనిషే

**వేద న్యూస్, బాన్సువాడ**

రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషేనని, ఆయన ఎప్పటికీ కాంగ్రెస్ నేత కాలేడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బాన్సువాడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన ఆయన, రేవంత్ రెడ్డి కప్పుకున్న కాంగ్రెస్ ముసుగును తొలగించి చూడాలని ప్రజలను కోరారు. రేవంత్ ముమ్మాటికి బడే భాయ్ తమ్ముడేనని విమర్శించారు. రాష్ట్రంలోని మైనారిటీలు, మత రాజకీయాలను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డి లోపల ఉన్న బీజేపీ నాయకుడిని గుర్తించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ఎప్పటికీ కాంగ్రెస్ మనిషి కాలేడని, ముందు నుంచే బీజేపీకి అనుకూలంగా పనిచేశారని ఆరోపించారు. అధికారంలో ఉన్నాం కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలన్న కాంగ్రెస్ వాదన అర్థరహితమని, గత రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న రెండేళ్ల తర్వాత మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, అప్పట్లో గతంలో మాదిరిగా పట్టణాలను కాంగ్రెస్ కంటే మెరుగ్గా అభివృద్ధి చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. మైనారిటీలకు, బీసీలకు భారీ బడ్జెట్ ఇస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఎన్నికల హామీలు అమలైతే వాటి లబ్ధిదారులే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, మిగిలినవారు వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంపై కేటీఆర్ తీవ్ర ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో రేవంత్ రెడ్డి పోచారంపై చేసిన తీవ్ర వ్యాఖ్యలకు సంబంధించిన ఆడియో, వీడియో క్లిప్పులను సభలో వినిపించారు.



## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**వేద న్యూస్, గీసుకొండ**

గీసుకొండ మండల కేంద్రానికి చెందిన శ్రీరామోజు సుజాత అనే నిరుపేద మహిళ శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మరణించగా, మృతురాలి అంత్యక్రియల ఖర్చుల సహాయార్థం అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ రూ.5000 ల ఆర్థిక సహాయం పంపి తన మానవత్వం చాటుకున్నారు. సదరు ఆర్థిక సహాయాన్ని గీసుకొండ సోషల్ సర్వీస్ టీం ప్రతినిధి, ప్రభుత్వ ఉపాధ్యాయులు కర్ణకంటి రాంమూర్తి బాధిత కుటుంబానికి అందజేయగా, ఈకార్యక్రమంలో వీరితో పాటు టీం సభ్యులు ముల్క సత్యనారాయణ, కత్తి వెంకటేశ్వర్లు, స్థానిక పెద్దలు పొగాకు కిష్టయ్య, బండారి వెంకటేశ్వర్లు, ముల్క మార్కండేయ, ప్రసాద్ వాజపేయి, కర్ణకంటి గణేష్, కోటిలింగాచారి మరియు తాటికొండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

దేశీయ మార్కెట్‌లో పసిడి ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. ఇటీవల స్వల్పంగా తగ్గిన బంగారం రేట్లు మళ్లీ పెరుగుదల బాట పట్టడంతో కొనుగోలుదారులు షాక్‌కు గురవుతున్నారు. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఈ రోజు 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,56,600గా నమోదైంది. నిన్నటితో పోలిస్తే దాదాపు రూ.2,890 పెరిగింది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,43,550గా ఉంది. ఇది నిన్నటి ధరతో పోలిస్తే సుమారు రూ.2,650 పెరిగినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. 18 క్యారెట్ల బంగారం ధర కూడా గణనీయంగా పెరిగి 10 గ్రాములకు రూ.1,17,450గా నమోదైంది. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే సుమారు రూ.5,000 పెరిగి రూ.2,85,000కు చేరుకుంది.

# మంత్రుల పరేషాన్!

## మున్సిపల్ ఎన్నికలు తెచ్చిన తిప్పలు
## ఫలితాలకు వారినే బాధ్యులను చేయనున్న హస్తం పార్టీ




**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అయితే ఈసారి ఎన్నికల వేడి అభ్యర్థుల కంటే ఎక్కువగా రాష్ట్ర కేబినెట్ మంత్రులను ఆందోళనకు గురిచేస్తోంది.. మున్సిపల్ ఫలితాలే గీటురాయిగా మంత్రుల రిపోర్ట్ కార్డులు సిద్ధం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకేతాలివ్వడంతో, ఇప్పుడు ప్రతి మున్సిపాలిటీ మంత్రులకు అత్యంత కీలకంగా మారింది. ఇది కేవలం స్థానిక పోరు కాదు.. మంత్రుల పదవులకు అగ్నిపరీక్ష లాంటిది. గత ఎన్నికలకు భిన్నంగా ఈసారి కాంగ్రెస్ అధిష్టానం సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలోని మంత్రులను కేవలం వారి జిల్లాలకే పరిమితం చేయకుండా, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇన్చార్జీలుగా నియమించింది. తమకు కేటాయించిన పార్లమెంట్ పరిధిలోని ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాల్సిన సంపూర్ణ బాధ్యత మంత్రులదే. ఒకవేళ తమ ఇన్చార్జ్ ఏరియాలో ఆశించిన ఫలితాలు రాకపోతే, అది సదరు మంత్రి అసమర్థతగా పరిగణించబడుతుందని అధిష్టానం స్పష్టం చేసింది. దీంతో మంత్రులు తమ నియోజకవర్గాలను వదిలి, కేటాయించిన ప్రాంతాల్లోనే తిష్టవేసి వ్యూహప్రతివ్యూహాలు రచిస్తున్నారు.

### అంతర్గత కుమ్ములాటలు..

దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీని గ్రూపు రాజకీయాలు పట్టిపీడిస్తున్నాయి. ఇది మంత్రులకు పెద్ద తలనొప్పిగా మారింది. పార్టీలో మొదటి నుంచి జెండా మోసిన పాత నేతలకు, అధికారంలోకి వచ్చాక చేరిన కొత్త నేతలకు మధ్య టికెట్ల కేటాయింపు చిచ్చు పెట్టింది. చాలా చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలకు, మాజీ ఎమ్మెల్యేలకు లేదా టికెట్ ఆశించి భంగపడ్డ సీనియర్లకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తమ అనుచరులకు టికెట్లు దక్కలేదని అలిగిన నేతలను బుజ్జగించడం మంత్రులకు కత్తిమీద సాములా మారింది. వీరు ప్రత్యర్థి పార్టీలతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటున్నారనే వార్తలు మంత్రులను మరింత కలవరపెడుతున్నాయి.

### మంత్రుల్లో వణుకు

ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కొన్ని జిల్లాల్లో సర్పంచ్ ఎన్నికల్లో అనుకున్న ఫలితాలు రాకపోవడంతో, సంబంధిత ఎమ్మెల్యేలు, జిల్లా నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ తీవ్రస్థాయిలో క్లాస్ పీకారు. మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే సీన్ రిపీట్ అయితే కఠిన చర్యలు ఉంటాయని పరోక్షంగా హెచ్చరించారు. దీంతో సర్పంచ్ ఎన్నికల తప్పులను సరిదిద్దుకుంటూ, మున్సిపల్ గెలుపు కోసం మంత్రులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు.

### మంత్రుల వ్యూహాలు!

ఎన్నికల్లో ప్రత్యర్థుల కంటే సొంత పార్టీలోని కోవర్టులే ప్రమాదకరమని మంత్రులు భావిస్తున్నారు. లోకల్ లీడర్ల మధ్య ఉన్న గ్యాప్‌ను పూడ్చేందుకు మంత్రులు రాత్రింబవళ్లు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అసంతృప్త నేతలకు భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు ఇస్తామని, నిధులు కేటాయిస్తామని హామీలు ఇస్తూ వారిని శాంతింపజేస్తున్నారు. సొంత నియోజకవర్గంలో గెలవకపోతే క్యాడర్‌లో పట్టు తప్పుతుందని, అలాగే రాష్ట్ర స్థాయిలో పరువు పోతుందని మంత్రులు లోలోపల మదనపడుతున్నారు.

### కేబినెట్ విస్తరణ భయం..

రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత హాట్ టాపిక్ మంత్రివర్గ విస్తరణ, మార్పులు.. ఎన్నికల అనంతరం కేబినెట్ ప్రక్షాళన ఉంటుందని, పనితీరు ఆధారంగానే మంత్రులకు ప్రాధాన్యత ఉంటుందని ప్రచారం జరుగుతోంది. మున్సిపల్ ఫలితాలు తేడా కొడితే, ఒకరిద్దరు మంత్రులపై వేటు పడే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. తమ పదవిని కాపాడుకోవాలంటే ఈ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం మంత్రులకు అనివార్యంగా మారింది.

# గెలిపించే బాధ్యత మీది.. అభివృద్ధి బాధ్యత మాది

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
## వర్ధన్నపేటలో రోడ్ షో.. కార్నర్ మీటింగ్

**వేద న్యూస్, వర్ధన్నపేట**




ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వర్ధన్నపేట పట్టణ అభివృద్ధికి అదనంగా రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించే బాధ్యత తానే తీసుకుంటానని మంత్రి పొంగులేటి తెలిపారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులకు సంబంధించి శుక్రవారం రోడ్డు షో, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. 4, 5, 6 వార్డులకు డీసీ తండా దుర్గమ్మ సెంటర్‌లో, 1, 2, 3, 9, 10 వార్డులకు అంబేద్కర్ సెంటర్‌లో, 7, 8, 11, 12 వార్డులకు ఫిరంగిగడ్డలో కార్యక్రమాలు జరిగాయి. వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత అధికారి కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో కలిపిన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఎల్లమ్మ గుడి నిర్మాణాన్ని తమ సొంత నిధులతో చేపడతానని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయని మంత్రి తెలిపారు. ఇప్పటికే మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని పుర పోరులో గెలిపిస్తే స్థానిక సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ప్రజలను కోరారు.

### అన్ని రంగాల్లో అభివృద్ధి ప్రధాన లక్ష్యం..: కేఆర్ నాగరాజు

అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, వర్ధన్నపేట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గంలో గెస్ట్ హౌస్‌లు నిర్మించుకోవడం లేదా భూములు కబ్జా చేయడం తన అలవాటు కాదని స్పష్టం చేశారు. పేదలకు సొంత ఇళ్లు కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్లను తీసుకొచ్చామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.294 కోట్లతో పలు పనులు చేపట్టామని, తండాల్లోని యువత కోసం మినీ స్టేడియం నిర్మాణాన్ని ప్రణాళికలో పెట్టామని చెప్పారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ.. అధికార పార్టీ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థుల విజయం వర్ధన్నపేట అభివృద్ధికి ఊతమిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల ఇన్‌చార్జి, డీసీసీ చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, మాజీ టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, టౌన్ పార్టీ అధ్యక్షుడు మైస సురేష్‌తో పాటు 12 వార్డుల అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఫోన్ ట్యాపింగ్ వంటి అత్యంత సంచలనాత్మక కేసుకు సంబంధించిన కీలక సాంకేతిక ఆధారాలు ఉన్న ఫోరెన్సిక్ ప్రయోగశాలలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. కేసు చార్జిషీట్ దాఖలు చేసే కీలక దశకు చేరుకున్న సమయంలోనే ఈ ఘటన జరగడం అనుమానాలకు తావిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే ఆధారాలను తుడిచివేయాలనే ఉద్దేశంతో హార్డ్ డిస్కులను ధ్వంసం చేసి మూసీ నదిలో పడేశారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటిని దర్యాప్తు సంస్థలు తిరిగి స్వాధీనం చేసుకుని, అందులోని డేటాను వెలికితీయడానికి ఫోరెన్సిక్ ప్రయోగశాలలో డీకోడ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇలాంటి కీలక సమయంలోనే ప్రయోగశాలలో అగ్నిప్రమాదం జరగడం కేసు దిశను మరింత సున్నితంగా మార్చింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే హరీష్ రావు, కేటీఆర్, కేసీఆర్ విచారణలు పూర్తవ్వగా, చార్జిషీట్ దాఖలు దశలో ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం రాజకీయ వర్గాల్లోనూ, ప్రజల్లోనూ అనేక అనుమానాలకు దారి తీస్తోంది. ఆధారాల పరిశీలన తుది దశకు చేరుకున్న వేళ ఈ అగ్నిప్రమాదం యాదృచ్ఛికమా? లేక కావాలనే చేయించిన చర్యనా? అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. అగ్నిప్రమాదానికి గల కారణాలు, కీలక ఆధారాలకు ఎంత మేర నష్టం వాటిల్లిందన్న అంశాలపై అధికారులు లోతైన విచారణ చేపట్టారు. ఈ ఘటనతో ఫోన్ ట్యాపింగ్ కేసు మరింత సంచలనంగా మారింది. రాబోయే రోజుల్లో ఈ వ్యవహారంలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని రాజకీయ, న్యాయ వర్గాలు భావిస్తున్నాయి.

## ఉరి సీన్ రీల్ తీస్తూ..

### ప్రమాదవశాత్తు మెడకు బిగుసుకున్న తాడు
### మహిళ మృతి

**వేద న్యూస్, డెస్క్**

సోషల్ మీడియా రీల్స్ పిచ్చి ఓ మహిళ ప్రాణాలు తీసిన విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బండా జిల్లాలో చోటుచేసుకుంది. ఉరి వేసుకున్నట్టుగా నటిస్తూ రీల్ చిత్రీకరించేందుకు ప్రయత్నించిన మహిళ ప్రమాదవశాత్తు ఉరి తాడుకు బిగుసుకుని మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం, మృతురాలు 27 ఏళ్ల మోహిని. ఆమె తరచుగా రీల్స్ రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుండేదని తెలిపారు. ఈ క్రమంలో ఉరి వేసుకున్నట్టు నటిస్తూ రీల్ తీయాలని భావించిన ఆమె, ఇంట్లో స్టూల్‌పై నిలబడి మెడకు ఉరి తాడు వేసుకుంది. అయితే అకస్మాత్తుగా కాలు జారడంతో అదుపుతప్పి కిందకు పడిపోయింది. దీంతో ఉరి తాడు మెడకు బిగుసుకుని అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటన సమయంలో ఇంట్లోనే ఉన్న నాలుగేళ్ల కుమార్తె గదిలోకి వచ్చి తల్లి ఉరికి వేలాడుతూ కనిపించడంతో భయాందోళనకు గురైంది. వెంటనే సహాయం కోసం కేకలు వేయడంతో పొరుగువారు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి పోస్ట్‌మార్టం కోసం తరలించారు. మోహిని మొబైల్ ఫోన్‌లో లభించిన వీడియో రికార్డుల ఆధారంగా రీల్ కోసం చేసిన ప్రయత్నంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. అయితే ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

## గోదావరి జలాలతో సస్యశ్యామలం

మొదటి పేజీ తరువాయి

ప్రణాళికలను తక్షణమే ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. తాండూరు పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తిచేయడంతో పాటు కాగ్నా నది నుంచి తాగునీటిని అందించే కార్యక్రమాలను అమలు చేస్తామని సీఎం తెలిపారు. అలాగే ఏడాది లోపే అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ, అక్కడి నుంచి తాండూరు వరకు రహదారి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణ మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్‌తో పాటు రేడియల్ రోడ్లను కూడా పూర్తి చేస్తామని, రాబోయే రోజుల్లో వికారాబాద్ జిల్లా అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారబోతోందని సీఎం పేర్కొన్నారు. మౌలిక వసతులు, రవాణా సౌకర్యాల అభివృద్ధితో జిల్లా రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని అన్నారు. ప్రజా ప్రభుత్వం అనేక సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతోందని, ప్రజలంతా సహకరించాలని సీఎం కోరారు. తెలంగాణలో రైతులు, నిరుద్యోగ యువత, మహిళలను కేంద్రంగా చేసుకుని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు.

వేద న్యూస్
ఆదివారం ఫిబ్రవరి 08, 2026

# జాతీయ రహదారే డంప్ యార్డ్!

- రోడ్డు పక్కనే చికెన్, ప్లాస్టిక్ వ్యర్థాలు
- వాటి కోసం ఎగబడుతున్న కుక్కలు, పందులు
- ప్రయాణికులకు పొంచి ఉన్న ప్రమాదం
- అధికారుల నిర్లక్ష్యం.. స్థానికుల ఆగ్రహం





**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న జాతీయ రహదారికి అనుసంధానంగా కేశవపట్నం నుంచి చల్లూరు, వీణవంక వరకు వెళ్లే రెండు వరుసల రహదారి ఉంది. ఈ రహదారిని మండల కేంద్రానికి వచ్చే అనేక గ్రామాల ప్రజలు రోజూ వివిధ అవసరాల కోసం వినియోగిస్తున్నారు. కొద్ది రోజులుగా మండల కేంద్రంలోని చికెన్ సెంటర్ల నిర్వాహకులు, వివిధ దుకాణాల యజమానులు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం, వ్యర్థ ఆహార పదార్థాలు, చికెన్ సెంటర్ల నుంచి వచ్చే ఈకలు, కోడి లోపలి వ్యర్థ అవయవాలు, చనిపోయిన కోళ్లను రహదారి పక్కన నిర్లక్ష్యంగా డంపు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**కుక్కలు, పందుల స్వైర విహారం**

ఈ వ్యర్థాల కారణంగా పదుల సంఖ్యలో కుక్కలు, పందులు, వందల సంఖ్యలో కోతులు అక్కడికి చేరి గుంపులుగా మారుతున్నాయి. అవి వ్యర్థాలను తినే క్రమంలో రోడ్డుపైకి లాగి తీసుకువస్తుండటంతో రహదారిపై తరచూ అవరోధాలు ఏర్పడుతున్నాయి. పరస్పరం గొడవలు పెట్టుకోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై అకస్మాత్తుగా కోతులు, పందులు, కుక్కలు అడ్డురావడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఇంకా పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు ఈ జంతువులు వాహనదారులపై దాడులకు కూడా దిగుతున్నాయని పేర్కొంటున్నారు.

**దుర్వాసనతో ప్రజల అవస్థలు**

వ్యర్థాల డంపింగ్ వల్ల ఆ ప్రాంతంలో వాతావరణం తీవ్రంగా కలుషితమవుతోంది. ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి, కుళ్లిపోయిన వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీని వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ వ్యాపారులు ఎందుకు ఇక్కడే వ్యర్థాలను డంపు చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామపంచాయతీ నుంచి చెత్త ట్రాక్టర్ క్రమం తప్పకుండా వస్తుందా? కేశవపట్నంలో ప్రత్యేక డంపింగ్ యార్డ్ ఉందా లేదా? ఉంటే అక్కడికి చెత్త ఎందుకు తరలించడం లేదని నిలదీస్తున్నారు.

**చర్యలు తీసుకోవాలని డిమాండ్**

గ్రామ పరిధిలోని జాతీయ రహదారులపై ఇష్టానుసారంగా వ్యర్థాలను డంపు చేస్తున్నా స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వ్యర్థాలు డంపు చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఈ ప్రాంతం జంతువుల ఆవాసంగా మారకుండా చేసి, ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ అధికారుల ప్రజా బాట




**వేద న్యూస్, హనుమకొండ :**

హనుమకొండ జిల్లా నడికుడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో కరెంటు సమస్యల పరిష్కారం కోసం అధికారులు ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా కరెంటు సమస్యలు ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వల్ల ప్రమాదాలు జరగకుండా నివారించడానికి అవసరమైన చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ రాహుల్, లైన్ ఇన్స్పెక్టర్ సుధాకర్, జె ఎల్ ఎం అవినాష్, గ్రామపంచాయతీ సిబ్బంది సురేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

## వైన్స్‌లో టాస్క్ ఫోర్స్ అధికారుల తనిఖీలు



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని టెన్ టు టెన్ లిక్కర్ వైన్స్‌లో శనివారం ఎక్సైజ్ డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైన్స్‌కు సంబంధించిన పలు రికార్డులను అధికారులు పరిశీలించారు. అదేవిధంగా మద్యం స్టాక్ వివరాలను అడిగి తెలుసుకుని, మద్యం విక్రయాల వివరాలను డైలీ అకౌంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. తనిఖీల్లో వైన్స్‌లో పనిచేస్తున్న వారిలో ఒక్కరికి మాత్రమే నౌకరినామ ఉండగా, మిగిలిన ఇద్దరికి నౌకరినామ లేకపోవడంతో వెంటనే నౌకరినామ చేయించుకోవాలని అధికారుల ద్వారా సూచించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్ ఎస్సై సింధు సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ల నిర్లక్ష్యంపైమేనేజర్ కి ఫిర్యాదు



**వేద న్యూస్, నల్లబెల్లి :**

ఆర్టీసీ డ్రైవర్ల నిర్లక్ష్యంపై తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ కి పోస్ట్ కార్డ్ ద్వారా తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య శనివారం పిర్యాదు చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మండలంలని అన్ని దారుల్లో నడిపిస్తున్న పల్లె వెలుగు సర్వీసు లకు సంబంధించి బస్సు డ్రైవర్లు, కండక్టర్లు బస్టాండ్ ప్రాంగణంలో లో తప్ప మిగతా ప్రదేశాల్లో లో బస్సులు ఆపడం లేదని వివిధ గ్రామాల నుండి మండల కేంద్రానికి పనుల నిమిత్తం వచ్చే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు. బస్టాండ్ ఏరియాలో కాకుండా మిగతా ప్రాంతాలలో కూడా బస్సులు ఆగేవిధంగా చర్యలు చేపట్టాలని లేనియెడల ప్రజా సంఘాలు, వివిధ పార్టీలు, కుల సంఘాలను, కలుపుకొని సమిష్టిగా పెద్ద ఎత్తున ప్రజా ఆందోళన కార్యక్రమాలు చేపడతా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పరికిరత్నం, నాయకులు ఇనుగాల రవి, ప్రసాద్, రవీందర్,యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కవిత వేణుగోపాల్ రెడ్డిని గెలిపించాలి

**- దామరచర్లలో కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం**

**వేద న్యూస్, దామరచర్ల**

మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల్లో 17వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి నూకల కవిత వేణుగోపాల్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ నేతలు గడపగడపకు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. 17వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నూకల కవిత వేణుగోపాల్ రెడ్డికి హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమె గెలుపుతోనే వార్డు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, మహిళలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ, మహిళలకు వడ్డీ లేని రుణాలు, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు వంటి అనేక కార్యక్రమాలు తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బంటు కిరణ్, చల్ల అంజిరెడ్డి, వాచ్య తండా సర్పంచ్ సుజాత రవి నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి



రెడ్డి, దాసరి భీమేష్, ఇంజం లచ్చి రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, వంశీ చారి, దానవత్ కిషన్ నాయక్, అమృ నాయక్, పద్మ శేఖర్ రెడ్డి, దొంగరి స్వాతి రెడ్డి, సరిత రెడ్డి, రఫీ, వెంకట్ రెడ్డి, రామ్ రెడ్డి, నరేంద్ర, నవీన్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



**వేద న్యూస్, వీర్నపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో గ్రామీణ ప్రజలకు ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో అక్షరాస్యత సదస్సును తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ మదం సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మొబైల్ యాప్‌ల వినియోగం వంటి అంశాలపై నిపుణులు విపులంగా వివరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. నగదు లావాదేవీలతో పాటు డిజిటల్ చెల్లింపులను కూడా సురక్షితంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు అలవాట్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సదస్సులో మహిళలు, యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల్లో ఆర్థిక, సాంకేతిక అవగాహన మరింత పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## కేటీఆర్ సభకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు



**వేద న్యూస్, రుద్రూర్:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభ ఏర్పాటు చేయడంతో శనివారం రుద్రూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో అక్కడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా రుద్రూర్ మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీగా బాన్సువాడకు చేరుకొని సభలో పాల్గొన్నారు. బహిరంగ సభకు తరలివెళ్లిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రుద్రూర్ మండల ఇంచార్జ్ గాండ్ల మధు, నాయకులు దౌర్ సాయిలు, కొత్తపల్లి రవికిరణ్, కర్రోళ్ల వెంకటేష్, పట్ల సాయి, శివకుమార్, బొట్టె గజేందర్‌తో పాటు పలువురు కార్యకర్తలు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం



**వేద న్యూస్, రుద్రూర్:**

బోధన్ పట్టణంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా శనివారం రుద్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జోరుగా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోధన్ మున్సిపాలిటీ 26వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంకు దామోదర్‌కు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. చేయి గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంకు దామోదర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరు చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన ట్రాక్టర్ సంఘం కార్యవర్గం ఎన్నిక



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల ట్రాక్టర్ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించి కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా బొజ్జ ప్రభాకర్, ద్యావ నరేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పెగ్గర్ల శేఖర్, సంబ మహేష్ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పిట్టల మోహన్, కోశాధికారిగా గుంటి అనిల్ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా జెరిపోతుల నాగరాజు, గుంటి శేఖర్, జంకే శ్రీనివాస్ రెడ్డి, నాగం మల్లేశంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ట్రాక్టర్ సంఘ సభ్యులు అభినందనలు తెలియజేస్తూ, సంఘ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

వేద న్యూస్

ఆదివారం ఫిబ్రవరి 08, 2026

# దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



**వేద న్యూస్,జ్యోతినగర్:**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 12వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే మహా సమ్మె ను విజయవంతం చేయాలని ఎన్టీపీసీ ట్రేడ్ యూనియన్ జేఏసీ నాయులు పిలుపును ఇచ్చారు. శనివారం ఎన్టీపీసీ ఓ ప్రవేట్ హోటల్ లో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సమ్మెలో కార్మిక సంఘాలు, ఉద్యోగుల యూనియన్లు, రైతు సంఘాలు, ఆశా వర్కర్లు సహా పలు వర్గాలు పాల్గొననున్నాయని తెలిపారు. కార్మిక హక్కులకు భంగం కలిగించే విధంగా తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిరుద్యోగానికి పరిష్కారం చూపాలి, ధరల పెరుగుదలను నియంత్రించాలి, ప్రైవేటీకరణ విధానాలను నిలిపివేయలన్నారు. ఈ సమ్మె ప్రభావంతో బ్యాంకింగ్, రవాణా, పోస్టల్, విద్యుత్, బీమా తదితర కీలక సేవలు కొంతవరకు అంతరాయం చెందే అవకాశముందని యూనియన్ నేతలు తెలిపారు. అనేక చోట్ల ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమ్మెను జయప్రదం చేయాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. ప్రజలు సమ్మె కారణాలను అర్థం చేసుకొని సహకరించాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# అందరినీ ఆత్మీయంగా కలుస్తూ..

- 19వ వార్డులో కమలనాథుల జోరు ప్రచారం
- ఆదరించి అవకాశం ఇవ్వండి
- ప్రజలకు కౌన్సిలర్ అభ్యర్థి సురేష్ అభ్యర్థన





**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి రాయబారపు సురేష్ ఆ పార్టీ శ్రేణులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయం కోసం, ధర్మాన్ని నిలబెట్టేందుకు తాను బరిలో.. నిలిచి ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తన ను ఆశీర్వదించి ఒక అవకాశం కల్పిస్తే నిస్వార్థంగా సేవ చేస్తూ.. వార్డు ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని తెలిపారు. స్వార్థం కోసం రాజకీయాల్లోకి రావడంలేదని నిస్వార్థంగా నిష్పక్షపాతంగా ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో ఉండటం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజీపడకుండా సమస్యల పరిష్కారంలో ముందుంటానని ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని ప్రజలను చేతులెత్తి ప్రార్థించారు.

# జోరుగా జనసేన నాయకుల ప్రచారం



**వేద న్యూస్, రుద్రూర్:**

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బిచ్కుంద మున్సిపాలిటీలోని 10వ వార్డు కౌన్సిలర్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న జనసేన పార్టీ అభ్యర్థి స్వరూపకు మద్దతుగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకు తిరుగుతూ జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జనసేన పార్టీ అభ్యర్థి గెలుపుతోనే వార్డు అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 10వ వార్డు ప్రజలు స్వరూపకు మద్దతుగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ పీఓసీ మెంబర్ అజయ్ కృష్ణ, బాన్సువాడ నియోజకవర్గ పీఓసీ మెంబర్ రవీందర్ చవాన్, మహేష్, దుర్గాప్రసాద్, జంగం సాయి కృష్ణ, మంగ్రామ్‌తో పాటు రుద్రూర్ జనసేన నాయకులు షాధుల్, ఈర్వ అవినాష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12న జాతీయ సమ్మెలో పాల్గొనాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు
- సమ్మె కరపత్రం ఆవిష్కరణ



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ, కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనగాం రాజమల్లు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ల ద్వారా కార్పొరేట్ సంస్థలకు సులభతర వ్యాపారానికి ద్వారాలు తెరిచిందని విమర్శించారు. కార్పొరేట్ల లాభాలను పెంచడానికే పని గంటలు పెంచడం, ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగాలు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాలను అమలు చేస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటోందని ఆరోపించారు. గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ల పేరుతో కార్మిక హక్కులను హరిస్తున్నారని అన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా చేయడమే కాకుండా పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ వంటి మౌలిక హక్కులను కూడా కార్మికులకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. సంఘం పెట్టుకునే హక్కు, సంఘటితమయ్యే హక్కు, నిరసన తెలిపే హక్కు, సమ్మె చేసే హక్కులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే జాతీయ సమ్మెలో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపెల్లి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కంపెల్లి పోచయ్య, కార్పొరేషన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మనుపాటి మల్లేశం, దేవునూరి శ్యామ్ సుందర్, రవీందర్, గంగయ్య, తిరుపతి, చంద్రయ్య, రాములు, స్వామి, మురళీ కృష్ణతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేకు యాదవ సంఘం ఆత్మీయ అభినందన

**వేద న్యూస్, శంకరపట్నం:**

జూబ్లీహిల్స్ 2025 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా శనివారం హుజురాబాద్‌కు రావడంతో, యాదవ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఐలేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ ఎమ్మెల్యేగా విజయం సాధించడం ఎంతో సంతోషకరమైన, గర్వకారణమైన విషయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని కీలక పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు గొర్ల కొమురయ్య యాదవ్, వేదిక నాయకులు గొర్ల అనిల్ యాదవ్, కేశవని రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# షబానా అయ్యుబ్ ను గెలిపించాలి..

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్



**వేదన్యూస్, దామరచర్ల**

మిర్యాలగూడ మున్సిపాలిటీ లో43 వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షబానా అయ్యుబ్ ను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి బరోసాగా నిలుస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నే అభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు. కాంగ్రెస్ తరపున బరిలో నిలిచిన అందరివాడు, పిలిస్తే పరిగెత్తుకొచ్చే ఆయుబ్ బాయ్ సతీమణి షాబానాకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షేక్ జావిద్ తోపాటు పలువురు నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాలేగూడ ఆదివాసీ యూత్ సేవా కార్యక్రమాలు



- రోగి చికిత్సకు, అనాథ యువతి వివాహానికి అండగా..

**వేద న్యూస్, కాసిపేట:**

కాసిపేట మండలం సాలేగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ యూత్, మహిళా సభ్యులు మానవత్వాన్ని చాటుతూ రెండు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తూ సమాజానికి స్ఫూర్తిదాయకంగా మారారు. సాలేగూడ గ్రామానికి చెందిన ఆడే లచ్చు అనే నిరుపేద యువకుడు కిడ్నీలో రాళ్లు, మూత్ర విసర్జన సమస్యతో బాధపడుతూ మంచిర్యాలలోని ఆసుపత్రిలో చికిత్స పొందాడు. వైద్య పరీక్షల్లో రక్తం తక్కువగా ఉందని, శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు వెళ్లాలని చెప్పడంతో, ఆర్థిక స్థోమత లేక బాధితుడు ఇంటికి తిరిగి రావాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న సాలేగూడ ఆదివాసీ యూత్ సభ్యులు స్పందించి, పరస్పర సహకారంతో బాధితుడికి సహాయం చేయాలని నిర్ణయించారు. శస్త్రచికిత్స కోసం తమ వంతుగా రూ.10వేల నగదు సహాయాన్ని బాధితుడికి అందజేశారు. అలాగే గట్రావుపల్లి గ్రామానికి చెందిన అర్క. ఝాన్సీ లక్ష్మి అనే యువతి చిన్న వయసులోనే తండ్రిని, కరోనా సమయంలో తల్లిని కోల్పోయి అనాథగా మారింది. ఆమె వివాహం జరగనున్న నేపథ్యంలో ఆదివాసీ యూత్, మహిళా సభ్యులు ముందుకు వచ్చి ఆర్థిక సహాయంతో పాటు 100 కుర్చీలు, టెంట్లు, టేబుల్స్, నిత్యావసర సరుకులు అందజేసి పెళ్లికి అండగా నిలిచారు. సమాజంలోని పేదలు, అవసరంలో ఉన్నవారికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని పలువురు ప్రశంసలు వ్యక్తం చేశారు. ఈ సేవా కార్యక్రమాల్లో యూత్ ప్రెసిడెంట్ సిడాం గణపతి, జనరల్ సెక్రటరీ పెంద్రం ప్రభాకర్, కోశాధికారి పెంద్రం శ్రీనివాస్, సలహాదారు పెంద్రం చందు, మాడావి మనిక్ రావు, మడావి శేఖర్, కుడిమేత జైతు, రవీందర్, శ్రీకాంత్, మారు, తిరుపతి, సంపత్, ప్రమీల, శంకరమ్మ, లావణ్య, సంధ్యారాణి, స్వరూప, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జి పనుల పరిశీలన

- వేగవంతం చేయాలని అధికారుల ఆదేశాలు



**వేద న్యూస్, కాసిపేట:**

అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ మెయిన్ గేట్ నుంచి దేవపూర్ గ్రామపంచాయతీకి వెళ్లే ప్రధాన రోడ్డుపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జ్ పనులను సంబంధిత ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ప్రజల రాకపోకలు సులభంగా, సురక్షితంగా సాగేందుకు బ్రిడ్జ్ పనులను నిర్ణీత కాలవ్యవధిలో వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మార్గం దేవపూర్ గ్రామ ప్రజలకు అత్యంత కీలకమైనదని, ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. బ్రిడ్జ్ నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవపూర్ గ్రామ సర్పంచ్ రాయి సిడం రాందాస్‌తో పాటు గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుండ్లపాడ్‌లో అగ్ని ప్రమాదం

- నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన సమాజ సేవకులు



**వేద న్యూస్, కాసిపేట:**

కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గుండ్లపాడ్ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదం ఒక నిరుపేద కుటుంబాన్ని రోడ్డున పడేసింది. గ్రామానికి చెందిన పెంద్రం నాగు నివసిస్తున్న పెంకుటిల్లు గురువారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైం ది. ఈ ఘటనలో కుటుంబానికి కట్టుబట్టలు తప్ప మరేమీ మిగలకపోవడంతో బాధితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. బాధితుడి వివరాల ప్రకారం.. రాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్షణాల్లోనే ఇంటి మొత్తం వ్యాపించాయి. ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి బస్తాలు అగ్నికి ఆహుతయ్యాయి. అలాగే ఇంటి అవసరాల కోసం దాచుకున్న కొంత నగదు, గృహో పకరణాలు, నిత్యావసర వస్తువులన్నీ బూడిద య్యాయి. అతి తక్కువ సమయంలోనే ఈ ప్రమాదం వల్ల భారీ నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే సమాజ సేవకులు ఎంబడి కిషన్, కల్కి సేవకుల సమన్న, వెడ్మ బాబురావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సహాయ చర్యల్లో భాగంగా 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే కుటుంబ సభ్యులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కల్కి భక్తుడు సమన్న బాధితుడికి రూ.5,001 నగదు సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇల్లు పూర్తిగా దగ్ధమై నివాసం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. అగ్ని ప్రమాద పరిహారం కింద తగిన నష్టపరిహారం మంజూరు చేసి, నివాస పునర్నిర్మాణానికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెంద్రం సోనే రావు, శంకర్, బొజ్జారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

**– ఉపాధి హామీ నిధులతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి**



**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బొడగట్టు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధి హామీ నిధులతో ప్రహరీ నిర్మాణానికి శనివారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పట్లోళ్ల భూంరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూంరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల చుట్టూ సుమారు 250 మీటర్ల మేర ప్రహరీ గోడను నిర్మించి త్వరలోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రహరీ గోడ నిర్మాణం వల్ల పాఠశాల భద్రత మరింత పెరుగుతుందని, విద్యార్థులు అనవసరంగా బయటకు వెళ్లకుండా పాఠశాల పరిధిలోనే ఉండగలుగుతారని తెలిపారు. అలాగే కుక్కల బెడద తగ్గడంతో పాటు బయటి వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించకుండా నియంత్రణ ఏర్పడుతుందని, పాఠశాల ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

# అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**– ఆహార నమూనాలు సేకరించి నాణ్యత ప్రమాణాలు పరీక్షించాలి**
**– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం**



**వేద న్యూస్, మంచిర్యాల:**

జిల్లాలో ఆహార భద్రతా శాఖ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్యతో కలిసి ఆహార భద్రత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఆహార వ్యాపార, వాణిజ్య సంస్థల నుంచి ఆహార నమూనాలు సేకరించి నాణ్యత ప్రమాణాలు పరీక్షించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత, కాల పరిమితి, ట్రేడ్ లైసెన్స్‌లు పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికులు శుభ్రత ప్రమాణాలు పాటించేలా అవగాహన కల్పించాలని, సంక్షేమ వసతి గృహాల్లో అందిస్తున్న పౌష్టికాహార నమూనాలను పరీక్షించాలని తెలిపారు. ఆహార నాణ్యతపై ఫిర్యాదుల కోసం 7981904028 నంబర్‌ను సంప్రదించవచ్చని, అలాగే https: //foscos.fssai.gov.in వెబ్‌సైట్‌లో ఫోటోలతో ఆన్‌లైన్ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ఫుడ్ సేఫ్టీ విభాగంలో రాతపూర్వకంగా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

# జనం నిండు ఆశీస్సులు కోరుతూ..

**– ప్రచారంలో.. ప్రతి ఒక్కరితో మమేకమవుతూ..**
**– జనసేన 24 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి భాగ్య శేఖర్ విస్తృత ప్రచారం**

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 24 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి భాగ్య శేఖర్ ప్రచార పర్వంలో దూసుకు వెళ్తున్నారు. గడపగడపకు తిరుగుతూ... ప్రజలందరి విశ్వాసం చూరగొంటూ.. ముందుకు సాగుతున్నారు. తన భర్త రాస మల్ల శేఖర్ కరోనా కష్టకాలంలో తన అంబులెన్స్ ద్వారా సేవలను ప్రజలకు విస్తృతంగా అందించారని భాగ్య వివరిస్తున్నారు.అనాథ శవాలను సైతం తన అంబులెన్స్ ద్వారా తరలించి అంత్యక్రియలు నిర్వహించి అందరికీ ఆదర్శంగా శేఖర్ నిలిచారని., నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ పేద ప్రజలపై మమకారంతో తను సంపాదించిన దానిలో కొంత భాగం సేవ చేస్తూ..సర్వ్ పీపుల్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా చక్కటి సేవలను శేఖర్ అందిస్తున్నారని చెబుతూ...24వ వార్డు ప్రజలకు 24 గంటలు ఉచిత అంబులెన్స్ సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. 24వ వార్డు ప్రజల ఆశీర్వాదంతో కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉంటున్నానని, తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే ఇలాంటి సేవా కార్యక్రమాలతో పాటు వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని రాస మల్ల భాగ్య శేఖర్ దంపతులు వెల్లడిస్తున్నారు. ఒకసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే నాయకురాలిగా కాకుండా సేవకులుగా తాము చిత్తశుద్ధితో పనిచేస్తామని., ప్రజలకు స్పష్టం చేస్తూ.. వినమ్ర పూర్వకంగా ఓట్లు అభ్యర్థిస్తున్నారు. గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు.





# అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

**– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**వేద న్యూస్, మంచిర్యాల:**

2026-28 కాలానికి గాను అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం అర్హులైన జర్నలిస్టుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో అక్రిడిటేషన్ మాడ్యూల్ వెబ్‌సైట్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనున్నందున, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. మీడియా యాజమాన్యాలు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం తమ ప్రతినిధుల పేర్ల జాబితాను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి పంపించాలని సూచించారు. ఆ జాబితాలో ఉన్న అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ నుంచి https://ipr.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఆహార భద్రత అధికారి మహేష్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వైరాలో కాంగ్రెస్ భారీ ప్రచారం



**వేద న్యూస్, కారేపల్లి:**

వైరా మున్సిపల్ ఎన్నికల సమరం ముమ్మరమైంది. శనివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీమతి రాంపుడి రాజ్యలక్ష్మి గెలుపును కాంక్షిస్తూ, వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల పాల్గొని, ఎమ్మెల్యేతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 'చేయి' గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో 15వ వార్డు జనసందోహంగా మారింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, కాంగ్రెస్‌తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని నాయకులు ఉద్ఘాటించారు. ఈ ప్రచారానికి జిల్లా, రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ నాయకులు భారీగా హాజరై అభ్యర్థికి మద్దతు తెలిపారు. ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మాజీ డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, టీపీసీసీ వైరా అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కనకం పవన్ కళ్యాణ్ తో పాటు నాయకులు జావిద్, ఈసాల వెంకటేశ్వర్లు (గిద్దేవారిగూడెం సర్పంచ్), బాలు (రావోజీతండా సర్పంచ్) తదితరులు పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. కనకం పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో డిజిటల్ మాధ్యమాల్లోనూ ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్ద పీట

**– డీసీసీ అధ్యక్షుడు రఘునాథరెడ్డి**
**– పార్టీ అభ్యర్థికి మద్దతుగా ఇంటింటి ప్రచారం**



**వేద న్యూస్, క్యాతనపల్లి:**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చందనగిరి లావణ్య శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాతనపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే వార్డు పరిధిలో నిరుపయోగంగా ఉన్న పంచశీల మైదానాన్ని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనగిరి శ్రీనివాస్, వార్డు ఇంచార్జీలు తుంగపిండి రాజేష్ కుమార్, నర్సయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ కు ఇష్టమైన వ్యక్తి ప్రణవ్

**– మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ దే విజయం:మంత్రులు తుమ్మల,పొన్నం**



**వేద న్యూస్, జమ్మికుంట:**

ఈ నెల 11 న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి, అభివృధ్ధికి పట్టం కట్టాలని జమ్మికుంట మున్సిపల్ ప్రజలను కోరారు మంత్రులు తుమ్మల నాగేశ్వంరావు,పొన్నం ప్రభాకర్. శనివారం జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్స్ లో జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి బిఎన్ రెడ్డి,జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి వోడితల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పట్టణంలో డాల్ఫిన్ హోటల్ వద్ద చాయ్ తాగుతూ అందరినీ పలకరించారు.అనంతరం వారు మాట్లాడుతూ సర్వేలన్నీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయని అభ్యర్థులు బాగా కష్టపడి పనిచేయాలని,ఇంటి,ఇంటికి వెళ్లి ఓటర్లను కలవాలని సూచించారు.గతంలో ఈ ప్రాంతంలో ఎంపీగా పని చేసిన నాకు ఈ ప్రాంతంతో అనుభవం ఉందని,మరల ఈ ప్రాంతానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానని పొన్నం తెలిపారు. హుజూరాబాద్ లో ప్రణవ్ నాయకత్వంలో నిధులు కేటాయిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ నుండి పోటీ చేసే అభ్యర్థులు,వార్డు ఇంచార్జీలు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జనం సంపూర్ణ విశ్వాసం చూరగొంటూ..

**– 28 వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి రమేష్ ప్రచారం**
**– కౌన్సిలర్ గా గెలుపు దిశగా బలమైన అడుగులు**





**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 28వ వార్డు ప్రజలు అధికార పార్టీ అభ్యర్థి ఒగ్గు రమేశ్ ప్రచారంలో ముందు వరుసలో దూసుకెళుతున్నారు. ఆయన వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ప్రజాశ్రేయస్సుయే ధ్యేయంగా ముందుకు సాగుతున్న అధికార పార్టీ తరఫున ప్రజా ప్రతినిధి వార్డులో ఉంటే.. తమ పనులు చక్కగా చకచకా జరుగుతాయనే అభిప్రా యాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ప్రచారంలో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి ఒగ్గు రమేశ్ దూసుకెళ్తున్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ.. గడపగడప ప్రచారం నిర్వహిస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నారు.

**జన శ్రేయస్సు యే ప్రధానం**

వార్డు అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీకి ఓటు వేయడం అవసరమని, అప్పుడే సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందుతాయని ఈ సందర్భంగా ప్రచారంలో కౌన్సిలర్ అభ్యర్థి రమేష్ ప్రజలకు వివరిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నా యని, రాబోయే రోజుల్లో తనను గెలిపిస్తే అర్హులైన నిరుపేదలకు పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు. తనకు అవకాశం ఇస్తే.. 24/7 కౌన్సిలర్ గా ప్రజలకు అందుబాటులో ఉంటానని, పిలుపు దూరంలోనే ఉంటూ.. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని వెల్లడిస్తున్నారు. తమ ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని, కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి ఒగ్గు రమేశ్ గెలుపు పక్కా అని అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# విక్టరీ పక్కా..

- భరోసానిస్తున్న ఓటర్లు
- బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి రవీందర్ రావు విస్తృత ప్రచారం
- క్షేత్రస్థాయిలో ప్రచారంలో బలంగా ముందుకు..
- 30వ వార్డులో గులాబీ ప్రభం'జనమే ' : లీడర్ల ధీమా



**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 30 వ వార్డు లో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి రవీందర్ రావు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయనకు జనం మద్దతు తెలుపుతూ.. ఆశీస్సులు అందజేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నారు. కౌన్సిలర్ అభ్యర్థి రవీంద్రరావు దంపతులు వార్డు ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ.. ప్రచారంలో ముందంజలో ఉన్నారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంటింటికి వెళ్లిన అభ్యర్థి రామడుగు రవీందర్ ను ఓటర్లు అక్కున చేర్చుకుంటున్నారు. విజయం నీదే అంటూభరోసానిస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో బలమైన ప్రచారం**

క్షేత్రస్థాయిలో బలంగా..వార్డు పరిధిలోని ప్రజానీకంతో మమేకమవుతూ.. క్షేత్రస్థాయిలో బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి రవీందర్ బలంగా దూసుకెళ్తున్నారు. ప్రజాక్షేమమే ధ్యేయంగా ఎన్నికల బరిలో నిలిచిన తనను నిండు మనసుతో ఆశీర్వదించి కౌన్సిలర్ గా గెలిపించాలనిరెండు చేతులు జోడించి ఓటరు మహాశయులను ప్రార్థిస్తున్నారు. తాను వార్డు ప్రజలందరికీ పిలుపు దూరంలోనే అందుబాటులో ఉంటా నని, జనక్షేమమే ధ్యేయంగా చిత్తశు ద్ధితో పనిచేస్తానని వెల్లడి స్తున్నారు. వార్డును అభివృద్ధి పథంలో ముందు వరుసలో నిలపడమే కాకుండా.. వార్డు ప్రజలకు కష్ట సుఖాలలో అండగా నిలిచే కుటుంబ సభ్యుని వలె ఉంటానని హామీనిస్తున్నారు. తాను ప్రజల్లో ఉండేందుకే కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్నానని, తనను ఆదరించి ఆశీర్వదిస్తే.. తప్పకుండా అందరికీ శక్తివంచన లేకుండా ప్రజా ప్రతినిధిగా సేవలందించేందుకు 24/7 పూర్తి సమయం కేటాయి స్తానని స్పష్టంగా హామీ ఇస్తున్నారు. కాగా, బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి రవీందర్ ప్రచారానికి ప్రజల నుంచి చక్కటి ఆదరణ లభిస్తు న్నదని, ఆయన గెలుపు తథ్యమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

# బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- మునిసిపల్ ఎన్నికల్లో.. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

**వేద న్యూస్ , జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 19 వ వార్డులో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి జావేద్ జనంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శనివారం ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 19 వ వార్డు లో జావీద్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో గులాబీ పార్టీ శ్రేణులు విస్తృతంగా జనంతో మమేకమవుతున్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థికి అపూర్వ స్పందన, ఆదరణ లభిస్తోందని తమ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ లీడర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 19వ వార్డు పరిధిలోని ప్రజలే తన కుటుంబ సభ్యులని, వారి కష్ట సుఖాలలో తోడుగా తాను కుటుం బ సభ్యుని వలె ఉంటానని, జనం కోసం పని చేసే నాయకుడిగా, కార్యకర్తగా తాను ఉంటానని కౌన్సి లర్ అభ్యర్థి జావేద్ ప్రజలకు భరోసానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జావేద్ గెలుపుపై పలువురు ధీమా వ్యక్తం చేస్తున్నారు. విజయం జావేద్‌దే అంటూ ఓటర్లు సైతం భరోసానిస్తున్నారని పేర్కొంటున్నారు.

# ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతా..



- 9వ వార్డు అభివృద్ధి యే ప్రధాన లక్ష్యం
- ప్రచారంలో బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి పి జె ఆర్

**వేద న్యూస్ ,జమ్మికుంట :**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని తొమ్మిదో వార్డులో బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి పొన గంటి రవీందర్ (పీజేఆర్) విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. వార్డు పరిధిలో ప్రజలు అందరితో మమేకమవుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా వింటూ, తాను కౌన్సిలర్‌గా గెలిస్తే పరిష్కారానికి కట్టుబడి ఉంటానని హామీ ఇస్తున్నారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాలు, పారిశుధ్యం, పేదల గృహ సమస్యలు వంటి కీలక అంశాలపై స్పష్టమైన ప్రణాళికను ప్రజల ముందు ఉంచుతూ విశ్వాసం కలిగిస్తున్నారు. ప్రచారంలో భాగంగా యువత, మహిళలు, వృద్ధులతో ప్రత్యేకంగా సమావేశమవుతూ వార్డు అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తానని తెలిపారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు, మహిళల భద్రత, స్వచ్ఛమైన వాతావరణం కోసం బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జమ్మికుంట పట్టణానికి మరింత మేలు చేస్తాయని పేర్కొన్నారు.

**విశేష స్పందన**

పొనగంటి రవీందర్ ప్రచారానికి వార్డు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రచారంలో పాల్గొనడం, బీజేపీ జెండాలు ఎగరవేయడం ద్వారా మద్దతు ప్రకటిస్తున్నారు. ముఖ్యంగా పి.జె.ఆర్ అందుబాటు స్వభావం, సేవాభావం ప్రజలను ఆకర్షిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా పొనగంటి రవీందర్ మాట్లాడుతూ, "9వ వార్డు అభివృద్ధే నా ఏకైక లక్ష్యం. మాటలకే పరిమితం కాకుండా పనుల ద్వారా ప్రజల నమ్మకాన్ని నిలబెడతాను. ప్రతి సమస్యకు పరిష్కారం చూపే కౌన్సిలర్‌గా నిలుస్తాను" అని ధీమా వ్యక్తం చేశారు. మొత్తానికి జమ్మికుంట మున్సిపాలిటీ ఎన్నికల్లో 9వ వార్డు బీజేపీ అభ్యర్థిగా పొనగంటి రవీందర్ (పి.జె.ఆర్) ప్రచారంలో దూసుకుపోతూ ప్రత్యర్థులకు గట్టి సవాల్ విసురుతున్నారు.

# ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్

**వేద న్యూస్, జమ్మికుంట :**




రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఒక్క ఓటరు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించాలని శనివారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ పట్టణంలోని గాంధీ చౌరస్తాలో హోర్డింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ప్రజలు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని, మద్యం, డబ్బులు లాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా, బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, టిపివో శ్రీధర్, టిపిఎస్ రాజ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రఫీ లతో పాటు పలువురు ఉన్నారు.

# సురక్ష ఆన్‌లైన్ డైలీకి వంద రోజులు.. వేడుకల్లో డీజీపీ

- సురక్ష బృందానికి అభినందనలు
- పత్రికను మరింత పటిష్టం చేయాలని సూచన
- పోలీసింగ్‌లో సమాచారానికి కీలక పాత్ర



**వేద న్యూస్ హైదరాబాద్ :**

తెలంగాణ పోలీస్ శాఖ అధికారిక పత్రిక 'సురక్ష ఆన్‌లైన్ డైలీ' వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురక్ష ఎడిటర్‌తో పాటు మొత్తం బృందాన్ని ఆయన అభినందించారు. సురక్ష పత్రిక ద్వారా పోలీస్ శాఖ కార్యకలాపాలు, ప్రజలకు అవసరమైన భద్రతా సమాచారం విస్తృతంగా చేరుతోందని డీజీపీ పేర్కొన్నారు. ప్రజలతో పోలీస్ శాఖ మధ్య నమ్మకాన్ని పెంపొందించడంలో ఇలాంటి పత్రికలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సురక్ష ఆన్‌లైన్ డైలీని భవిష్యత్తులో మరింత పటిష్టంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, నాణ్యమైన సమాచారం, ప్రజలకు ఉపయోగపడే అంశాలతో ముందుకు వెళ్లాలని సూచించారు. పోలీస్ శాఖ విజయాలను, సేవలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే వేదికగా సురక్షను తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, సురక్ష బృంద సభ్యులు పాల్గొని ఈ విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు.

# ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

- సాధారణ ఎన్నికలపై..



**వేద న్యూస్, జమ్మికుంట :**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జమ్మికుంట ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రెసీడింగ్ అధికారులకు రెండోవ సాధారణ ఎన్నికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఎన్నికలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు జితేందర్ రెడ్డి, జిల్లా వ్యయ పరిశీలకులు మనోహర్ లు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, మున్సిపల్ వారు మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ఈ 2వ సాధారణ ఎన్నికలు సజావుగా పూర్తి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడి, టిపివో శ్రీధర్, టిపిఎస్ రాజ్ కుమార్, రఫీ లతో పాటుపలువురు పాల్గొన్నారు.

# ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్లే..




**వేద న్యూస్ హైదరాబాద్ :**

నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ స్పందించారు. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం షార్ట్ సర్క్యూట్‌గానే భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లోని సీజ్డ్ ప్రాపర్టీస్ గదిలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా, ఆ గది పూర్తిగా దగ్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ ఫోరెన్సిక్ భవనం చాలా పాతదని, దీనిని పద్దెనిమిది వందల ఎనభైయేళ్ల లో నిర్మించారని తెలిపారు. చివరి గదిలో ఉన్న స్విచ్ బోర్డు వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడంతోనే మంటలు చెలరేగాయని చెప్పారు. అక్కడి నుంచి మంటలు వేగంగా వ్యాపించినప్పటికీ, సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారని వివరించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. ఎండాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అగ్నిప్రమాదాల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని ఫైర్ డీజీ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలన్నింటినీ తనిఖీ చేస్తామని తెలిపారు. అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటామని, సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటారని ఆయన వెల్లడించారు.

# ఇంట్లోని పెద్దలకు ఇవి చెప్పారా?

**వేద న్యూస్ హైదరాబాద్ :**




ఆన్‌లైన్ మోసగాళ్లు ఎక్కువగా ఇంట్లోని పెద్దలను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలంగాణ పోలీసులు హెచ్చరిస్తున్నారు. తెలియని లింకులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, ఆఫర్ల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, ఇంట్లోని పెద్దలకు ముందుగానే అవగాహన కల్పించాలని పోలీసులు సూచిస్తున్నారు. ముఖ్యంగా సైబర్ మోసాలపై ఇంట్లో చర్చించి, ఎలాంటి సందేహాస్పద పరిస్థితుల్లోనూ వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తెలియని వ్యక్తులు పంపే లింకులు క్లిక్ చేయవద్దని, అనవసరంగా వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టడం, ఫేక్ జాబ్ ఆఫర్లు, పార్సిల్ లేదా కూరియర్ పేరుతో ఫోన్ కాల్స్, ఓటీపీలు అడగడం వంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. వృద్ధులు ఎలాంటి భయానికి లోనుకాకుండా, ప్రశాంతంగా వ్యవహరించి ముందుగా కుటుంబ సభ్యులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. సైబర్ మోసాలను నివారించడంలో అవగాహననే ప్రధాన ఆయుధమని తెలంగాణ పోలీసులు స్పష్టం చేశారు. ఇంట్లోని పెద్దలతో ఈ విషయాలను తప్పకుండా పంచుకోవాలని, అవసరమైతే వారికి స్మార్ట్‌ఫోన్ వినియోగంపై కూడా మార్గనిర్దేశం చేయాలని కోరారు. అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ఆనందానికి కాదు, ఖర్చులకు పరిమితమైన పండుగలు

**– సంప్రదాయ ఉత్సవాల్లో పెరుగుతున్న ఆర్భాటండ తగ్గుతున్న సంతోషం**

**వేద న్యూస్ డెస్క్:**

పండుగ అనగానే ఒకప్పుడు మనసులో మెదిలేది ఆనందం. కుటుంబం అంతా ఒకచోట చేరడం, ఇంట్లో నవ్వులు, పంచుకునే భోజనాలు, పరస్పర ఆప్యాయతఇవే పండుగల అసలైన అర్థం. కానీ కాలం మారేకొద్దీ పండుగల రూపం కూడా మారింది. నేడు పండుగ అంటే ఆనందానికి ముందు ఖర్చుల లెక్కలు, అవసరానికి మించిన ఆర్భాటం, పోటీ భావన ఎక్కువగా కనిపిస్తోంది. ఈ పరిస్థితి పండుగల అసలు ఉద్దేశాన్ని ప్రశ్నించేలా చేస్తోంది

పండుగలు సమీపించగానే మార్కెట్లు కిటకిటలాడతాయి. కొత్త బట్టలు, అలంకరణలు, వంట సామగ్రి, బహుమతులుఇవన్నీ అవసరమా లేదా అన్న ప్రశ్నకంటే, "ఇతరులకంటే తక్కువగా ఉండకూడదు" అన్న భావన ముందుకు వస్తోంది. సామాజిక పోటీ పండుగలను ఆర్భాట ప్రదర్శనలుగా మార్చేస్తోంది. ఫలితంగా ఆనందం కంటే ఖర్చుల భారం ఎక్కువగా మారుతోంది.

ఈ ఖర్చుల ఒత్తిడి మధ్యతరగతి కుటుంబాలపై మరింత ప్రభావం చూపుతోంది. పండుగ ఆనందం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక రోజు సంబరాల కోసం నెలల పాటు ఆర్థిక భారాన్ని మోసుకోవాల్సి రావడం వాస్తవంగా మారింది. ఆనందం ఇవ్వాల్సిన పండుగ, ఆందోళనకు కారణమవడం ఒక విరోధాభాసం.

పండుగలలో ఆధ్యాత్మికత, సంప్రదాయ విలువలు కూడా క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు పూజలు, కుటుంబ పెద్దల ఆశీస్సులు, సమూహ భోజనాలు ప్రధానంగా ఉండేవి. ఇప్పుడు వాటి స్థానంలో ఆర్భాట కార్యక్రమాలు, ఖరీదైన అలంకరణలు, బహిరంగ ప్రదర్శనలు చోటు చేసుకుంటున్నాయి. సంప్రదాయం మౌనంగా వెనక్కి నెట్టబడుతోంది.

పిల్లలపై కూడా ఈ మార్పుల ప్రభావం పడుతోంది. పండుగ అంటే ఆనందం పంచుకోవడం అన్న భావన కంటే, ఎక్కువ వస్తువులు పొందడం అన్న ఆలోచన పెరుగుతోంది. పండుగ విలువలు పిల్లలకు సరైన రీతిలో చేరకపోవడం భవిష్యత్తుపై ప్రభావం చూపే అంశంగా మారుతోంది. పండుగలు మనసు పెంచే రోజులు కావాల్సిన చోట, కోరికలు పెంచే రోజులుగా మారుతున్నాయి.

అయితే పండుగలు పూర్తిగా తమ అసలు అర్థాన్ని కోల్పోయాయా అన్న ప్రశ్న కూడా వేసుకోవాలి. నిజానికి పండుగలు మారలేదు. మనం వాటిని చూసే దృష్టికోణమే మారింది. ఆనందాన్ని సరళతలో వెతకకుండా, ఆర్భాటంలో వెతుక్కోవడమే ఈ సమస్యకు మూలం. కుటుంబంతో గడిపే సమయం, కలిసి భోజనం చేయడం, ఒకరికొకరు సహాయం చేసుకోవడంఇవే పండుగల నిజమైన సంపద. పండుగలను మళ్లీ ఆనందానికి కేంద్రంగా మార్చుకోవాలంటే ఆలోచనల్లో మార్పు అవసరం. అవసరానికి మించిన ఖర్చులను తగ్గించుకోవాలి. పోటీ భావనను పక్కనపెట్టి, సంతృప్తిని ముందుకు తెచ్చుకోవాలి. సంప్రదాయాలను పిల్లలకు పరిచయం చేయాలి. అప్పుడే పండుగలు ఖర్చుల పండుగలుగా కాకుండా, ఆనందపు పండుగలుగా నిలుస్తాయి.

మొత్తంగా పండుగలు ఖర్చులకు పరిమితమయ్యాయా అన్న ప్రశ్నకు సమాధానం మన చేతుల్లోనే ఉంది. మనం ఏం కోరుకుంటున్నామన్నదే పండుగల స్వరూపాన్ని నిర్ణయిస్తుంది. ఆర్భాటాన్ని కాదు, ఆనందాన్ని ఎంచుకుంటేపండుగలు మళ్లీ మనసుకు వెలుగులు నింపే రోజులుగా మారతాయి.

# జనగామ యాదాద్రి మధ్య సంచరిస్తున్న పెద్దపులి.. ప్రజల్లో భయాందోళన

**వేద న్యూస్ జనగామ :**



మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి ప్రవేశించిన ఒక పెద్దపులి దాదాపు రెండు వందల యాభై కిలోమీటర్లు ప్రయాణించి, దట్టమైన అడవి కోసం వెతుకుతూ ప్రస్తుతం జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల మధ్య అటూఇటూ సంచరిస్తోంది. ఈ రెండు జిల్లాల్లో గత యాభై ఏళ్లుగా పెద్దపులి కనిపించిన దాఖలాలు లేవని అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఒక్కసారిగా పులి కదలికలు మొదలవడంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఈ పెద్దపులి యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక ప్రాంతం నుంచి లింగాలఘనపురం మండలం కుందారం శివారులో సంచరించినట్లు అటవీ శాఖ అధికారులు ధ్రువీకరించారు. శుక్రవారం రఘునాథపల్లి మండలం మండలగూడెం పరిసరాల్లో ఓ రైతుకు చెందిన లేగదూడపై దాడి చేసి చంపినట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారులు కొండల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, డీఎఫ్‌వో లావణ్య పరిశీలించి పులి పాదముద్రలను గుర్తించారు. అటవీ శాఖ సమాచారం ప్రకారం, ఈ పెద్దపులి గత సంవత్సరం నవంబరులో మహారాష్ట్ర పాండవఖారా డివిజన్ నుంచి తెలంగాణలోకి ప్రవేశించింది. కొద్ది రోజులు కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఉండి, ఆ తర్వాత అక్కడి నుంచి జిల్లాల వైపు కదలికలు మొదలుపెట్టింది. ప్రస్తుతం దట్టమైన అడవి ప్రాంతం లేకపోవడంతో దారి తెలియని పరిస్థితిలో గ్రామాల సమీపంలో తిరుగుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. పులి కదలికల నేపథ్యంలో పోలీసులు, అటవీ శాఖలు పలు సూచనలు జారీ చేశాయి. రాత్రివేళ బయటకు వెళ్లవద్దని, అత్యవసరమైతే ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని సూచించారు. ఎక్కడైనా పెద్దపులి కదలికలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. పశువులను రాత్రివేళల్లో బహిరంగ ప్రదేశాల్లో ఉంచవద్దని హెచ్చరించారు. ఈ పరిణామాలపై అటవీ శాఖ ప్రధాన వన సంరక్షణాధికారి డాక్టర్ సువర్ణ జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థకు నిరంతరం సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు. పెద్దపులిని భయపెట్టకూడదని, దాడిలో చనిపోయిన పశుమాంసాన్ని తిననివ్వాలని ఎన్టీసీఏ నుంచి సూచనలు వచ్చినట్లు చెప్పారు. ఆకలి తీరితే పులి ఆందోళన తగ్గి అటవీ ప్రాంతం వైపు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్దపులి జాడలను అనుసరించే అనుభవం ఉన్న తొమ్మిది మంది ట్రాకర్లను కాగజ్‌నగర్, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ల నుంచి అటవీ శాఖ పిలిపించింది. పులి దాడిలో పశువులు చనిపోయినట్టు ఫిర్యాదు చేస్తే మూడు రోజుల్లో పరిహారం చెల్లిస్తామని అటవీ శాఖ అధికారులు స్థానికులకు భరోసా ఇచ్చారు. ప్రజలు సహకరించాలని, అనవసరంగా గుమికూడకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

# పెమ్మసాని, గల్లా మాధవిపై మౌనిక సంచలన ఆరోపణలు

- తండ్రిపై హత్యాయత్నం జరిగిందని తీవ్ర వ్యాఖ్యలు
- పోలీసులే దాడికి సహకరించారని ఆరోపణ
- వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపాటు

**అమరావతి, వేద న్యూస్:**

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్పై వైసీపీ నేత అంబటి రాంబాబు కుమార్తె మౌనిక సంచలన వ్యాఖ్యలు చేశారు. పెమ్మసాని ఆదేశాలతో ఎమ్మెల్యే గల్లా మాధవి పర్యవేక్షణలో తన తండ్రిపై హత్యాయత్నం జరిగిందని ఆమె ఆరోపించారు. ఈ దాడికి పోలీసులు కూడా సహకరించారని తీవ్రంగా వ్యాఖ్యానించారు. తొలిసారి ఎమ్మెల్యే అయిన గల్లా మాధవికి ఇంత అహంకారం పనికిరాదని మౌనిక హెచ్చరించారు. న్యాయ వ్యవస్థ, పోలీసు వ్యవస్థల కంటే ఎవరూ ఎక్కువ కాదని స్పష్టం చేశారు. బాగా చదువుకున్న వ్యక్తిగా, విదేశాల నుంచి వచ్చిన పెమ్మసాని చంద్రశేఖర్ ఇక్కడి రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. తన తండ్రి అంబటి రాంబాబు ఎలాంటి రెడ్ బుక్‌లకు భయపడే వ్యక్తి కాదని మౌనిక తెలిపారు. లా అండ్ ఆర్డర్‌పై గౌరవంతోనే ఆయన క్షమాపణ చెప్పారని స్పష్టం చేశారు. రెండు వేల మంది చుట్టుముట్టి, రాళ్లు రువ్వినా తన తండ్రి ధైర్యంగా



నిలబడ్డారని చెప్పారు. ఇంటి గోడకు గునపాలు దింపుతున్నా, వ్యవస్థపై నమ్మకంతోనే ఆయన ఇంట్లో కూర్చున్నారని మౌనిక అన్నారు. కానీ వ్యవస్థల ను నిర్వీర్యం చేసిన వ్యక్తులు వచ్చి మహిళలపై దాడులు చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసు కోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# కుటుంబ జీవితాన్ని దెబ్బతీస్తున్న ఉద్యోగ ఒత్తిళ్లు

**– పనిలో విజయం వెనుక కరుగుతున్న అనుబంధాల కథ**

**వేద న్యూస్ డెస్క్:**

ఆధునిక జీవనంలో ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాదు. అది గుర్తింపు, భద్రత, గౌరవానికి మార్గంగా మారింది. ఈ మార్పుతో పాటు ఉద్యోగాలపై ఒత్తిళ్లు కూడా పెరిగాయి. పనిలో విజయం సాధించాలనే తపన, పోటీ, లక్ష్యాలు, సమయపరిమితులు ఇవన్నీ కలసి మనిషిని నిరంతర ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. ఈ ఒత్తిడి ప్రభావం పనివేదికతోనే ఆగిపోవడం లేదు. అది నేరుగా కుటుంబ జీవితంలోకి చొరబడుతోంది. ఉద్యోగ ఒత్తిళ్ల వల్ల మొదటగా దెబ్బతినేది సమయం. ఎక్కువ గంటలు పని చేయడం, ఇంటికొచ్చాక కూడా పనిని మనసులోనే మోసుకెళ్లడం వల్ల కుటుంబానికి కేటాయించే సమయం తగ్గిపోతుంది. ఒకే ఇంట్లో ఉన్నా, కుటుంబ సభ్యుల మధ్య మాటలు తగ్గుతాయి. భోజన సమయాలు కలిసి గడవడం అరుదవుతుంది. ఈ మౌనం క్రమంగా దూరంగా మారుతుంది.

పని ఒత్తిడి మనసును అలసటకు గురిచేస్తుంది. ఆ అలసట ఇంట్లో చిరాకు రూపంలో బయటపడుతుంది. చిన్న విషయాలకే కోపం రావడం, సహనం తగ్గిపోవడం, కుటుంబ సభ్యుల మాటలకు స్పందించలేకపోవడం వంటి పరిస్థితులు ఏర్పడతాయి. ఈ మార్పులను కుటుంబ సభ్యులు గమనించినా, కారణం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా అపార్థాలు పెరుగుతాయి.

తల్లిదండ్రులపై ఉద్యోగ ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు పిల్లలపై దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. తల్లిదండ్రుల సమయం, శ్రద్ధ తగ్గడంతో పిల్లలు భావోద్వేగంగా ఒంటరిగా మారుతారు. వారి విజయాలు, సమస్యలు, సందేహాలు పంచుకునే వేదిక లేకుండా పోతుంది. ఇది పిల్లల మానసిక ఎదుగుదలపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుంది.

ఇక్కడ సమస్య ఉద్యోగం కతల్లిదండ్రులపై ఉద్యోగ ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు పిల్లలపై దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. తల్లిదండ్రుల సమయం, శ్రద్ధ తగ్గడంతో పిల్లలు భావోద్వేగంగా ఒంటరిగా మారుతారు. వారి విజయాలు, సమస్యలు, సందేహాలు పంచుకునే వేదిక లేకుండా పోతుంది. ఇది పిల్లల మానసిక ఎదుగుదలపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుంది. మాట్లాడటం, వారి భావాలను వినడం, కలిసి సమయం గడపడం ఇవే కుటుంబ ఉద్యోగం చుట్టూ ఏర్పడిన అసమతుల్యతే అసలు సమస్య. పని, కుటుంబం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వలేకపోవడమే ఈ సంక్షోభానికి మూలం. కుటుంబం కోసం పని చేస్తున్నామనే భావన ఉన్నప్పటికీ, ఆ కుటుంబంతో గడిపే సమయం తగ్గిపోవడం ఒక విరోధాభాసంగా మారింది. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే ఆలోచనల్లో మార్పు అవసరం. పనికి పరిమితి ఉండాలి. కుటుంబానికి కేటాయించే సమయం కూడా బాధ్యతగా భావించాలి. పనిలో ఒత్తిడిని ఇంటికి మోసుకురావకుండా ఉండే ప్రయత్నం చేయాలి. కుటుంబ సభ్యులతో మాట్లాడటం, వారి భావాలను వినడం, కలిసి సమయం గడపడం ఇవే కుటుంబ బంధాలను నిలబెట్టే పునాదులు. ఉద్యోగ విజయం జీవితానికి అవసరమే. కానీ అదే జీవితం నుంచి ఆనందాన్ని తీసుకుంటే, ఆ విజయం అర్థం కోల్పోతుంది. కుటుంబమే మనిషికి నిజమైన ఆశ్రయం. ఆ ఆశ్రయం బలంగా ఉన్నప్పుడే ఏ ఉద్యోగ ఒత్తిడినైనా ఎదుర్కొనే శక్తి లభిస్తుంది. పనిలో ఎదగడం మంచిదే, కానీ కుటుంబాన్ని కోల్పోయే స్థాయికి కాదు. ఈ సమతుల్యతను సాధించడమే నేటి సమాజానికి అతిపెద్ద అవసరం.

# పవర్‌ఫుల్ ఎలక్ట్రిక్ కారు.. ఒక్కసారి ఛార్జింగ్‌తో ఏకంగా 500 కిలోమీటర్ల రేంజ్!

**వేద న్యూస్ డెస్క్:**


ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్లో టాటా మోటార్స్ మరోసారి సంచలనానికి సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 20, 2026న టాటా పంచ్ ఈవీ ఫేస్‌లిఫ్ట్‌ను అధికారికంగా విడుదల చేయనుంది. ఇప్పటికే దేశీయ మార్కెట్లో మంచి ఆదరణ పొందిన పంచ్ ఈవీకి ఇది తొలి పెద్ద అప్‌డేట్ కావడం విశేషం. ఈ కొత్త మోడల్‌లో బ్యాటరీ సామర్థ్యం, రేంజ్, ఫీచర్ల పరంగా కీలక మార్పులు ఉండనున్నట్లు ఆటోమొబైల్ వర్గాలు చెబుతున్నాయి. కొత్త పంచ్ ఈవీలో నెక్సాన్ ఈవీలో ఉపయోగిస్తున్న పెద్ద బ్యాటరీ ప్యాక్‌ను అమర్చే అవకాశం ఉందని సమాచారం. ఈ బ్యాటరీతో ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేస్తే దాదాపు 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించగల రేంజ్ ఉండొచ్చని అంచనా. ప్రస్తుతం చిన్న ఎలక్ట్రిక్ కార్లలో ఈ స్థాయి రేంజ్ లభించడం అరుదైన విషయం కావడంతో, పంచ్ ఈవీ మార్కెట్లో గట్టి పోటీ ఇవ్వనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీని ద్వారా రోజువారీ వినియోగం మాత్రమే కాకుండా లాంగ్ డ్రైవ్‌లకు కూడా ఈ కారు అనువుగా మారనుంది. లోపలి డిజైన్ విషయానికి వస్తే ఈ ఫేస్‌లిఫ్ట్ మోడల్‌లో మరింత ప్రీమియం అనుభూతి కల్పించేందుకు టాటా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. పెద్ద పరిమాణంలో టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, అధునాతన ఆడియో వ్యవస్థ, మెరుగైన సీట్ల అప్హోల్స్టరీ, కొత్త ట్రిమ్‌లు ఇందులో భాగమవుతాయని సమాచారం. ప్రయాణికుల సౌకర్యాన్ని పెంచేలా ఆధునిక ఫీచర్లు అందించనున్నారు. బాహ్య రూపంలో కూడా స్వల్ప మార్పులు చేయనున్నట్లు చెబుతున్నారు. ముందు, వెనుక భాగాల్లో కొత్త డిజైన్ బంపర్లు, కనెక్ట్ చేసిన ఎల్‌ఈడి డీఆర్‌ఎల్ లైట్లు, కొత్త అల్లాయ్ వీల్స్ వంటి అప్‌డేట్‌లు కనిపించనున్నాయి. మొత్తంగా చూస్తే పంచ్ ఈవీ లుక్ మరింత ఆధునికంగా, యూత్‌కు ఆకట్టుకునేలా మారనుందని ఆటో పరిశీలకులు భావిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ఇంధన వ్యయాల పెరుగుదల నేపథ్యంలో ఎలక్ట్రిక్ కార్ల వైపు వినియోగదారుల ఆసక్తి వేగంగా పెరుగుతోంది.



ఈ తరుణంలో 500 కిలోమీటర్ల రేంజ్ కలిగిన కాంపాక్ట్ ఎలక్ట్రిక్ కారును టాటా తీసుకురావడం మార్కెట్లో కీలక మలుపుగా మారనుందని అంచనా. సరసమైన ధరలో ఎక్కువ రేంజ్ అందిస్తే, మధ్యతరగతి కుటుంబాలకు ఇది మంచి ఎంపికగా మారే అవకాశం ఉంది. టాటా పంచ్ ఈవీ ఫేస్‌లిఫ్ట్ విడుదలతో దేశీయ ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ మరింత వేడెక్కనుందని, ఇతర కంపెనీల నుంచి కూడా కొత్త మోడళ్ల పోటీ పెరిగే అవకాశముందని ఆటోమొబైల్ నిపుణులు విశ్లేషిస్తున్నారు

# ఫిబ్రవరి 19న ఐఫోన్ 17e విడుదల!

**వేద న్యూస్ డెస్క్:**




టెక్ ప్రపంచంలో మరోసారి యాపిల్ సంచలనం సృష్టించేందుకు సిద్ధమవుతోం ది. మధ్యతరగతి వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని రూపొం దించిన కొత్త బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ ఐఫోన్ 17వ ను ఫిబ్రవరి 19న గ్లోబల్ మార్కెట్‌లో ఆవిష్కరించనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రీమియం బ్రాండ్ అయిన యాపిల్ తక్కువ ధరలో అధునాతన ఫీచర్లతో ఫోన్ విడుదల చేయడం టెక్ ప్రియుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ కొత్త ఐఫోన్ 17వ లో 6.1 అంగుళాల ఓలెడ్ డిస్‌ప్లే ఉండే అవకాశం ఉందని సమాచారం. గత మోడళ్లలో ఉన్న నాచ్‌కు బదులుగా ఈసారి ఆధునిక డైనమిక్ ఐలాండ్ ఫీచర్‌ను అందించనున్నారని టెక్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రీమియం ఐఫోన్ లుక్ ఈ బడ్జెట్ మోడల్‌కూ అందుబాటులోకి రానుంది. పర్ఫార్మెన్స్ పరంగా లేటెస్ట్ ఏ 19 చిప్‌సెట్‌ను ఇందులో వినియోగించనున్నట్లు తెలుస్తోంది. దీని వల్ల గేమింగ్, మల్టీటాస్కింగ్ వంటి పనుల్లో వేగవంతమైన అనుభవం లభించే అవకాశం ఉంది. కెమెరా విభాగంలోనూ యాపిల్ ఈసారి రాజీ పడలేదని టెక్ విశ్లేషకులు చెబుతున్నారు. 48 మెగాపిక్సెల్ మెయిన్ కెమెరాతో ఫోటోగ్రఫీ ప్రియులకు మెరుగైన అనుభవాన్ని అందించనుంది. స్టోరేజ్ విషయంలోనూ ఈ మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. భారీ ఫైల్స్, వీడియోలు, ఫోటోలు నిల్వ చేసుకునేందుకు 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్‌ను అందించనున్నట్లు సమాచారం.

# ట్రేడ్ డీల్‌తో తగ్గనున్న ధరలు..

**వేద న్యూస్ డెస్క్:**



భారత్‌అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో అమెరికా నుంచి దిగుమతి అయ్యే పలు ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు వాణిజ్య వర్గాలు వెల్లడించాయి. కొన్ని కీలక ఉత్పత్తులపై సున్నా సుంక విధానాన్ని అమలు చేసే అవకాశమూ ఉన్నట్లు సమాచారం. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే దేశీయ మార్కెట్‌లో అమెరికా నుంచి దిగుమతి అయ్యే అనేక వస్తువుల ధరలు తగ్గనున్నాయి. ముఖ్యంగా పరిశ్రమలకు అవసరమైన పారిశ్రామిక ఉత్పత్తులు, పశువుల మేతకు ఉపయోగించే ఆహార పదార్థాలు, ఎర్ర జొన్నలు వంటి వ్యవసాయ ఉత్పత్తులు చౌకగా లభించే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. దీని వల్ల పరిశ్రమల తయారీ వ్యయాలు కొంతవరకు తగ్గే అవకాశం ఉండటంతో పాటు, వ్యవసాయ రంగానికి కూడా ఉపశమనం కలగనుంది.అలాగే బాదం, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్, తాజా మరియు ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ ఆయిల్ వంటి ఆహార ఉత్పత్తుల ధరలు కూడా తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. విదేశీ వైన్, స్పిరిట్స్ వంటి పానీయాలపై కూడా సుంకాలు తగ్గితే వాటి ధరలు దేశీయ మార్కెట్‌లో మరింత అందుబాటులోకి రానున్నాయి.అయితే మరోవైపు అమెరికా నుంచి దిగుమతులు పెరిగితే దేశీయ దీంతో వినియోగదారులకు తక్కువ ధరలకు నాణ్యమైన ఉత్పత్తులు లభించే అవకాశం ఏర్పడుతుంది.

వేద న్యూస్

ఆదివారం ఫిబ్రవరి 08, 2026

# పవన్, మహేష్‌లతో సినిమాలు.. అయినా నో ఆఫర్స్..!



**వేద న్యూస్ డెస్క్:**

సినీ ఇండస్ట్రీలో ఎక్కువ కాలం కొనసాగడం అనేది అంత ఈజీ కాదు. హీరోలైనా హీరోయిన్లైనా స్టార్‌డమ్ ఒక స్థాయి వరకే పరిమితం. ఆ తర్వాత కొత్త తరహా నటీనటులు, కొత్త ముఖాలు రావడంతో చాలామంది తెర వెనక్కి వెళ్లిపోతుంటారు. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా కనిపిస్తుంది. ఒకప్పుడు వరుస సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న హీరోయిన్లు కొద్ది కాలంలోనే అవకాశాలు తగ్గిపోవడంతో ఇండస్ట్రీకి దూరమవు తున్నారు. ఈ కోవలోకే ఇప్పుడు ప్రణీత సుభాష్ పేరు కూడా వినిపిస్తోంది. స్టార్ హీరోలైన పవన్ కళ్యాణ్, మహేష్ బాబు లాంటి టాప్ స్టార్స్‌తో సినిమాలు చేసినప్పటికీ ప్రణీతకు కెరీర్ పరంగా ఆశించిన స్థాయి గుర్తింపు దక్కలేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో ఉంది. పవన్ కళ్యాణ్ నటించిన అత్తారింటికి దారేది సినిమాలో కీలక పాత్రలో కనిపించిన ప్రణీత, మహేష్ బాబు హీరోగా వచ్చిన బ్రహ్మోత్సవం చిత్రంలోనూ నటించింది. ఇలాంటి భారీ సినిమాల్లో అవకాశాలు రావడం సాధారణ విషయం కాదు. అయినప్పటికీ ఈ సినిమాలు ఆమె కెరీర్‌ను కొత్త దశకు తీసుకెళ్లలేకపోయాయి. ఫలితంగా కొంతకాలానికి ఆమెకు హీరోయిన్‌గా ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. నెమ్మదిగా సెకండ్ హీరోయిన్ పాత్రలకు పరిమితమవుతూ కెరీర్ సాగింది. అందం, అభినయం ఉన్నప్పటికీ వరుస హిట్లు పడకపోవడంతో ప్రణీత సినీ ప్రయాణం ఊహించినంత దూరం వెళ్లలేదని అభిమానులు భావిస్తున్నారు. ఒక దశలో సినిమాలకు గ్యాప్ ఇచ్చిన ఆమె ఆ తర్వాత పెళ్లి చేసుకుని పూర్తిగా సినిమాలకు దూరమైంది. దీంతో ఒకప్పుడు స్టార్ హీరోల సరసన నటించిన ఈ భామ ఇప్పుడు పెద్ద తెరపై కనిపించకపోవడం సినీ అభిమానులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇండస్ట్రీలో స్టార్ హీరోలతో నటించినా సరైన కథలు, సరైన టైమింగ్ లేకపోతే కెరీర్ నిలబడటం ఎంత కష్టమో ప్రణీత ఉదాహరణగా నిలుస్తోంది. సినిమాల్లో కనిపించకపోయినా సోషల్ మీడియాలో మాత్రం ప్రణీత యాక్టివ్‌గా ఉంటూ తన ఫోటోషూట్లతో నెట్టింట సందడి చేస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన గ్లామర్ ఫోటోలు నెటిజన్లను ఆకట్టుకుంటూ వైరల్ అవుతున్నాయి. 'ఇంకా ఛాన్స్ ఇవ్వాల్సిందే', 'అందం ఉన్నా అవకాశాలు రాకపోవడం బాధాకరం', 'స్టార్ హీరోలతో నటించినా ఇలా అవ్వడం ఇండస్ట్రీ కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి పవన్, మహేష్ లాంటి స్టార్ హీరోలతో నటించినా కూడా కెరీర్ నిలదొక్కుకోకపోవడం సినీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు ఎదురయ్యే కఠిన వాస్తవానికి మరో ఉదాహరణగా మారింది

## దెబ్బకు కనిపించకుండా పోయిందా ఈ బ్యూటీ..?

# ఓటీటీలోకి 'మన శంకర వరప్రసాద్‌గారు'

## స్ట్రీమింగ్ ఎప్పుడంటే?




**వేద న్యూస్ డెస్క్:**

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఆ క్షణం రానే వచ్చేసింది. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఇప్పుడు డిజిటల్ తెరపై సందడి చేసేందుకు సిద్ధమైంది. ఈ సినిమాకు ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా, ఫిబ్రవరి 11 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ ప్రారంభం కానున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో మిస్ అయినవారికి, మళ్లీ చూడాలనుకునే అభిమానులకు ఇది మంచి అవకాశంగా మారింది. దర్శకుడు అనిల్ రావిపూడి మార్కు ఎంటర్‌టైన్మెంట్, కామెడీ టైమింగ్, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లలో రికార్డు స్థాయి స్పందన తెచ్చుకుంది. వయసు, జానర్ పరిమితులు దాటి అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.375 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. మెగాస్టార్ చిరంజీవి ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ మరోసారి ప్రేక్షకులను థియేటర్లకు లాగగా, ఆయన సరసన నయనతార కథానాయికగా నటించి గ్లామర్‌తో పాటు ఎమోషనల్ టచ్‌ను అందించారు. ప్రత్యేక ఆకర్షణగా విక్టరీ వెంకటేష్ స్పెషల్ అప్పీరెన్స్ అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్‌గా నిలిచింది.

# పవన్ కళ్యాణ్ సినిమాలో ఫౌజీ భామ ఇమాన్వి..

**వేద న్యూస్ డెస్క్:**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచే అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పవన్ కళ్యాణ్ సినిమాలు అంటే మాస్ ఎలిమెంట్స్‌తో పాటు దేశభక్తి, పవర్‌ఫుల్ పాత్రలు ఉంటాయన్న అంచనా ఉంటుంది. ఈ నేపథ్యంలో సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ కొత్త చిత్రం మరింత భారీ స్థాయిలో ఉండబోతుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఉగాది నుంచి షూటింగ్ ప్రారం భం కానుందని సమాచారం. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తయినట్లు, పవన్ కళ్యాణ్ పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉండబోతుందని టాక్ నడుస్తోంది. ఈ సినిమా హీరోయిన్ ఎంపికపై తాజాగా సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగు తోంది. 'ఫౌజీ' అనే సిరీస్‌తో పాపులారిటీ సంపాదించిన యంగ్ బ్యూటీ ఇమాన్వి ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించబోతుందన్న ప్రచారం తెరపైకి వచ్చింది. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఇమాన్వి తక్కువ కాలంలోనే భారీ ఫాలోయింగ్ సంపా దించుకుంది. ఆమె డిఫరెంట్ లుక్, కాన్ఫిడెంట్ ప్రెజెన్స్ యువతలో క్రేజ్ తెచ్చిపెట్టింది. ఇప్పటికే బాలీవుడ్, సౌత్ ఇండస్ట్రీలో కొన్ని పెద్ద ప్రాజెక్ట్స్‌కు ఆమె పేరు పరిశీలనలో ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు పవన్ కళ్యాణ్ సినిమాలో ఆమె పేరు వినిపించడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. పవన్ కళ్యాణ్ సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని అభిమానులు ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నట్లు సమాచారం. భావి స్తారు. గతంలో కూడా పవన్ సరసన నటించిన హీరోయిన్లు టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఇమాన్వి ఎంపిక నిజమైతే ఆమె కెరీర్‌కు ఇది పెద్ద టర్నింగ్ పాయింట్ అవుతుందని సినీ విశ్లేష కులు అభి.ప్రాయ పడుతున్నారు. ముఖ్యం గా సురేందర్ రెడ్డి స్టైల్‌లో ఉండే పవర్‌ఫుల్ కథనంలో హీరోయిన్ పాత్ర కూడా బలంగా ఉండే అవకాశం



ఉందని టాక్. ఫౌజీ నేపథ్యం తో ఉన్న కథలో ఇమాన్వి పాత్రకు కీలక ప్రాధాన్యం ఉంటుందని సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఊహాగానాలు చేస్తున్నారు.

# సిద్ధు జొన్నలగడ్డ బర్త్‌డే బ్లాస్ట్..

## 'ఏజెంట్ ఆత్రేయ' డైరెక్టర్‌తో క్రేజీ కాంబినేషన్ ఫిక్స్!

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ స్టార్ బాయ్, 'టిల్లు' ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఇటీవల సరైన కమర్షియల్ హిట్లు లేక సతమతమవుతున్న సిద్ధు.. తన తదుపరి సినిమాతో గట్టిగా కమ్‌బ్యాక్ ఇవ్వాలని ఫిక్స్ అయ్యాడు. ఈ క్రమంలోనే క్రిటికల్‌గా ప్రశంసలు పొందిన 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' దర్శకుడు స్వరూప్ ఆర్ఎస్‌జేతో కొత్త సినిమాను అధికారికంగా ప్రకటించాడు. ఈ క్రేజీ కాంబినేషన్ ఒక్కసారిగా సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌ను 'ప్రొడక్షన్ నెం. 40'గా పిలుస్తున్నారు. ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సితార బ్యానర్‌లో సిద్ధుకు ఇది హ్యాట్రిక్ సినిమా కావడం విశేషం. గతంలో ఈ బ్యానర్‌పై సిద్ధు చేసిన సినిమాలు యువ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ సంపాదించాయి. అందుకే ఈసారి కూడా కంటెంట్ ఓరియెంటెడ్‌గా, వినూత్న కాన్సెప్ట్‌తో సినిమా రూపొందబోతోందన్న అంచనాలు మొదలయ్యాయి. స్వరూప్ ఆర్ఎస్‌జే దర్శకత్వం అంటేనే కథలో కొత్తదనం, ఇంటెలిజెంట్ హ్యా



మర్, ట్విస్టులతో కూడిన స్క్రీన్‌ప్లే అనే బ్రాండ్ ఉంది. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' సినిమాతో మిస్టరీ, ఇన్వెస్టిగేషన్ జానర్‌లో తన సత్తా చాటిన ఆయన.. ఇప్పుడు సిద్ధు జొన్నలగడ్డతో కలిసి ఏ తరహా కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాడో అన్న ఆసక్తి అందరిలోనూ పెరిగింది. సిద్ధు కూడా తన కామెడీ టైమింగ్, డిఫరెంట్ క్యారెక్టరైజేషన్స్‌తో ఈ ప్రాజెక్ట్‌కు కొత్త ఎనర్జీ తీసుకువస్తాడని చిత్ర యూనిట్ ధీమాగా చెబుతోంది.

# యువ భారత్‌పై కాసుల వర్షం..

## – విశ్వవిజేతలకు బీసీసీఐ రూ.7.5 కోట్ల నజరానా..!



**వేద న్యూస్ డెస్క్:**

అండర్-19 ప్రపంచకప్ 2026లో భారత యువ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. హరారే వేదికగా జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి రికార్డు స్థాయిలో ఆరోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. ఈ చారిత్రక విజయంతో దేశవ్యాప్తంగా సంబరాలు వెల్లువెత్తగా, విజేతలపై బీసీసీఐ కాసుల వర్షం కురిపించింది. ప్రపంచ విజేతలైన యువ భారత్ జట్టు కోసం భారీ నగదు బహుమతిని ప్రకటిస్తూ బీసీసీఐ రూ.7.5 కోట్ల నజరానాను ప్రకటించింది. ఈ నగదు బహుమతిని విజేత జట్టు ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, సహాయక సిబ్బంది మరియు సెలక్షన్ కమిటీకి పంచనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. ఒక్కో విభాగానికి ఎంత మొత్తం కేటాయించాలన్న వివరాలను త్వరలో ఖరారు చేస్తామని పేర్కొన్నారు. యువ క్రికెటర్ల అద్భుత ప్రదర్శనకు ఇది తగిన గుర్తింపేనని బీసీసీఐ పెద్దలు వ్యాఖ్యానించారు. దేశీయ స్థాయిలో ప్రతిభను గుర్తించి పెంపొందించే వ్యవస్థ బలంగా ఉండటంతోనే ఈ స్థాయి ఫలితాలు వస్తున్నాయని సైకియా ప్రశంసించారు. ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరు సాధించింది. కేవలం 14 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర శతకంతో ఇంగ్లండ్ బౌలర్లను బెంబేలెత్తించాడు. అతడి దూకుడైన ఇన్నింగ్స్ భారత్ భారీ స్కోరు సాధించడంలో అభిగ్యాన్ కుందు కూడా కీలక సమయంలో మెరుపులు మెరిపించి పరుగులు జోడించాడు. భారీ లక్ష్య ఛేదనకు దిగిన ఇంగ్లండ్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేక కుప్పకూలింది. మిడిల్ ఆర్డర్ పూర్తిగా విఫలమవ్వడంతో మ్యాచ్ భారత్ వైపు తేలిపోయింది.

# నెదర్లాండ్స్‌పై పాక్ విజయం.. స్వల్ప లక్ష్యాన్ని అతికష్టంగా చేధించిన పాకిస్థాన్!

**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు చివరి వరకు ఉత్కంఠభరితంగా పోరాడి విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. స్కాట్ ఎడ్వర్డ్స్ 37, బాస్ డీ లీడే 30 పరుగులతో రాణించారు. పాక్ బౌలింగ్‌లో సల్మాన్ మీర్జా మూడు వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశాడు. 148 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు ఫర్హాన్ 47 పరుగులతో మంచి ఆరంభం ఇచ్చాడు. అయితే మధ్య ఓవర్లలో వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. చివరి ఓవర్లలో ఫాహిమ్ అష్రఫ్ వేగంగా పరుగులు సాధించి మ్యాచ్‌ను పాక్ వైపు తిప్పాడు. చివరికి పాకిస్థాన్ 19.3 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. విజయం సాధించినప్పటికీ నెదర్లాండ్స్ గట్టి పోటీ ఇవ్వడం క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంది.



# అమెరికాపై భారత ఘన విజయం.. తొలిమ్యాచ్‌లోనే ధీటైన ఆరంభం



**వేద న్యూస్ డెస్క్:**

పొట్టి ప్రపంచకప్‌లో భారత జట్టు అదిరిపోయే ఆరంభం చేసింది. తొలి లీగ్ మ్యాచ్‌లో అమెరికా జట్టును ఎదుర్కొన్న భారత్ బౌలింగ్, బ్యాటింగ్ రెండింట్లోనూ ఆధిపత్యం చాటుతూ ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన భారత జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకోగా అమెరికా బ్యాటర్లు భారత పేస్ దళం దెబ్బకు ఆరంభంలోనే కుప్పకూలారు. తొలి మూడు వికెట్లు కేవలం 29 పరుగులకే కోల్పోయిన అమెరికా జట్టు తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లింది. భారత బౌలర్లు లైన్ లెంగ్త్ తప్పకుండా బంతులు వేయడంతో పరుగులు రావడం కష్టమైంది. మిడిల్ ఓవర్లలో అమెరికా బ్యాటర్లు కాస్త సమీకరించే ప్రయత్నం చేసినా భారత బౌలర్ల కట్టుదిట్టమైన నియంత్రణ ముందు నిలవలేకపోయారు. చివరకు నిర్ణీత ఓవర్లలో అమెరికా జట్టు 162 పరుగులు మాత్రమే చేయగలిగింది. అమెరికా తరఫున శుభమ్ 37 పరుగులు, సంజయ్ కృష్ణమూర్తి 37 పరుగులు, మిలింద్ 34 పరుగులు చేసి కొంత పోరాటం చూపించారు. అయితే మిగతా బ్యాటర్లు భారత బౌలర్ల వేగం, బౌలింగ్‌లో సిరాజ్ 3 వికెట్లతో ప్రత్యర్థి బ్యాటింగ్‌ను చీల్చివేయగా అక్షర్ పటేల్ 2 వికెట్లు, అర్ష్‌దీప్ సింగ్ 2 వికెట్లు తీసి జట్టుకు బలమైన ఆధిక్యం అందించారు. మరో బౌలర్ ఒక వికెట్ సాధించి అమెరికా ఇన్నింగ్స్‌ను కట్టడి చేశాడు. ఫీల్డింగ్‌లోనూ భారత ఆటగాళ్లు అప్రమత్తంగా వ్యవహరించి కీలక క్యాచ్‌లు పట్టారు. లక్ష్య రన్‌రేటును కంట్రోల్‌లో ఉంచుతూ వికెట్లు కోల్పోకుండా ముందుకు సాగారు. ప్రత్యర్థి బౌలర్లు మధ్య మధ్యలో ఒత్తిడి తేవాలని ప్రయత్నించినా భారత బ్యాటర్లు నిలకడగా క్రీజులో నిలబడి పరుగులు రాబట్టారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073